# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 139 | హైదరాబాద్ | గురువారం 20-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

## షేక్ హసీనా అప్పగింతకు భారత్ విముఖత...

## నేటి భారతం


- రాజకీయ నాయకుడు మాటలు చెప్పేవాడు కాదు, మాటలకు బాధ్యత వహించేవాడు కావాలి.
- ప్రజల విశ్వాసం గెలవడం ఓటు గెలవడంలా కాదు.. అది విలువను నిలబెట్టుకోవడమే.
- అధికారాన్ని పొందడం గొప్పది కాదు, అధికారాన్ని సత్యం కోసం ఉపయోగించడం గొప్పది.
- పార్టీలు మారితే చరిత్ర మారదు... కానీ రాజకీయ నాయకుల నడవడి మారితే ప్రజల భవిష్యత్తు మారుతుంది.
- పదవి అనేది గౌరవానికి ఇచ్చేది కాదు
- గౌరవం సంపాదించుకున్నవారికి పదవి స్వయంగా నమస్కారం చేస్తుంది.
- రాజకీయంలో ఓటు అడగడం సులభం... కానీ ప్రజా సమస్యలు వినడం, పరిష్కరించడం నిజమైన నాయకత్వం.
- మనసులో విలువలు లేని నాయకుడు, చేతిలో అధికారం ఉన్నా దేశానికి ఉపయోగం లేదు.
- అధికారం కోసం పోరాడేవాడు నాయకుడు కాదు...
- ఆ అధికారం ద్వారా ప్రజల హక్కుల కోసం పోరాడేవాడే నిజమైన నాయకుడు.

– గంగుల నరసింహారెడ్డి..

## వోకల్ ఫర్ లోకల్ మంత్రం

### పుట్టపర్తి వేదికగా ప్రధాని మోదీ కీలక పిలుపు

- పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ
- రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేసిన ప్రధాని
- సాయి బోధించిన ప్రేమ, సేవా మార్గం ప్రపంచానికి ఆదర్శమని వ్యాఖ్య


11లో


11లో

## మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ..


### హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి శుభవార్త

- హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం, రాష్ట్రం 50:50 వాటా
- నగరంలో అదనంగా 160 కి.మీ. మెట్రో లైన్ల నిర్మాణంపై ప్రతిపాదనలు
- విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులను పరిశీలిస్తున్నామన్న కేంద్రం
- మూసీ నది అభివృద్ధికి అమృత్ పథకం కింద నిధులు

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అరెస్టు


11లో

- సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన
- సింగరేణి భవన్ ఎదుట ఆందోళనకు దిగిన కవిత
- కవితను అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు




11లో

### తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు

## కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం

- ఓటరు జాబితా సవరణకు షెడ్యూలును ప్రకటించిన ఎన్నికల సంఘం
- ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ
- జిల్లా పంచాయతీ అధికారులకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు

## ఢిల్లీ పేలుడు... బయటకు వెళితే అనుమానంగా చూస్తున్నారు


11లో

- కొంతమంది చేసిన తప్పులకు కశ్మీరీలను బాధ్యులను చేయడం సరికాదన్న ఒమర్ అబ్దుల్లా
- ఉగ్ర కుట్రలకు తమను ఎక్కడ బాధ్యులను చేస్తారేమో అనే భయం ఉందని వ్యాఖ్య


11లో

## ప్రేమ, సేవకు ప్రతిరూపం సత్యసాయి..

- పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు
- హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఈ భూమిపై మనం చూసిన దైవ స్వరూపం బాబా అని కొనియాడిన సీఎం
- రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేసిన ప్రధాని, ముఖ్యమంత్రి

## వెంటాడుతున్న వైఫల్యాలు..

- రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోనే కొనసాగుతున్న సమాచార, పబ్లిక్ రిలేషన్స్ శాఖ..
- ప్రజలకు అత్యుత్తమ సమాచారం అందించే ప్రధాన శాఖ ఇది..
- ప్రభుత్వం ప్రజల కోసం ఏమి చేస్తోంది.. ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది అన్న విషయాలు ఈ శాఖ ద్వారా తెలుసుకోవచ్చు..
- భారీ ఎత్తున అడ్వర్టైజ్మెంట్ ల ద్వారా ప్రభుత్వం చేసే పనులను ప్రజల ముంగిట్లోకి తీసుకువచ్చే కీలకమైన శాఖ సమాచార శాఖ..
- వివిధ అడ్వర్టైజ్మెంట్ సంస్థలు మీడియా సంస్థలు వార్తాపత్రికల ద్వారా ప్రచారం సాగిస్తారు
- ప్రకటనలు ఇచ్చే క్రమంలో భారీ ఎత్తున అవినీతి చోటుచేస్తోంది అన్న విమర్శలు వెల్లు వెతుతున్నాయి..
- ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న మీడియా సంస్థలకు మాత్రమే ప్రకటనలు జారీ చేస్తున్నారని విమర్శకులు అంటున్నారు..


12లో

# ఐబొమ్మ రవి ప్రశ్నలకు సమాధానం ఏదీ

రవి అలియాస్ ఐబొమ్మ రవి అరెస్టు తర్వాత ఆయన చుట్టూ సోషల్ మీడియాలో విపరీతంగా చర్చ నడుస్తోందిపైరసీ, డాటా చోరీ, కాపీ రైట్ వంటి నేరాలకు రవి పాల్పడినట్టు పోలీసులు చెబుతుండగా, చిత్రంగా అదే సమయంలో ఆయనకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెద్ద సంఖ్యలో వస్తున్నాయి నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి, అదీ సినిమా పైరసీ, డాటా చోరీ వంటి నేరాలకు పాల్పడ్డాడని చెబుతున్న ఇమంది రవికి మద్దతుగా నెటిజన్లు పోస్టులు పెట్టడం ఇప్పుడు పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా సోషల్ మీడియాలో " సపోర్టు రవి, వియ్ సపోర్టు రవి" అంటూ కామెంట్లు పెడుతున్నారు..ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసి ఆయన దగ్గర్నుంచి హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, ల్యాప్ టాప్ లు స్వాధీనం చేసుకుని విశ్లేషించగా.. కీలక విషయాలు తెలిశాయని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రకటించారు."రవి వద్ద 21వేల సినిమాలు, 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డాటా ఉంది" అని సజ్జనార్ చెప్పారునేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి అరెస్టు అయితే, ఇలా పాజిటివ్ కామెంట్లు రావడం, పోస్టులు పెట్టడంపై సోషల్ మీడియాలోనూ చర్చ నడుస్తోంది.సినిమా పైరసీని సమర్థించడం లేదని చెబుతూనే, సినిమా టికెట్ రేట్ల అంశాన్ని ప్రస్తావిస్తున్నారు నెటిజన్లు.సినిమా టికెట్ల రేట్లు ఎక్కువగా ఉంటున్నాయని, సినిమా విడుదలైన రెండు వారాలపాటు రేట్లు పెంచడం కారణంగా థియేటర్లకు వెళ్లి చూడటం భారంగా ఉంటోందని సోషల్ మీడియాలో పోస్టు పెడుతున్నారు యూజర్లు.ఇక థియేటర్ కు వెళ్లినప్పుడు అక్కడ పాప్ కార్న్ రేట్లు, కూల్ డ్రింక్స్ రేట్లు ఎక్కువగా ఉంటున్నాయనేది నెటిజన్ల నుంచి వస్తున్న వాదన.సినిమా టికెట్ రేట్లు అందుబాటులో ఉంటే, ప్రజలు పైరసీవైపు వెళ్లే పరిస్థితి ఉండదు కదా.. అని వాదిస్తున్నవారూ ఉన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుని మొదటి రెండు వారాలపాటు టికెట్లు రేట్లు పెంచుకునేందుకు వీలుంటుంది. అలాగే పాప్‌కార్న్ రేట్ల విషయంలోనూ జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ 2023లోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.అయినప్పటికీ, పాప్‌కార్న్, బెవరేజస్ లూజ్ సేల్స్ పేరుతో రూ.150 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు సినీ ప్రేక్షకులు.'రూ.30 ఉండే పాప్ కార్న్ రూ.700 వరకు అమ్ముతుంటే, సినిమాలు ఏ విధంగా చూసేది' అని ప్రభాకర్ చౌటి అనే వ్యక్తి ట్విటర్(ఎక్స్)లో ట్వీట్ చేశాడు.ఇదే విషయంపై సోమవారం మీడియా సమావేశంలో సినీ ప్రముఖులని ప్రశ్నించగా.. వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఈ విషయంపై వారు స్పందించకుండానే మీడియా సమావేశం నుంచి వెళ్లిపోయారు.అయితే, సినిమా టికెట్ల రేట్లు అందుబాటులో ఉండాలనేది మా అభిప్రాయం కూడా అని బీబీసీతో చెప్పారు నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు."సినిమా టికెట్ల రేట్లు తగ్గించడానికి మావంతుగా ఎఫ్‌డీసీ తరఫున ప్రయత్నిస్తాం. టికెట్ల రేట్ల విషయంలో అందరితో మాట్లాడి అభిప్రాయం తీసుకుంటాం. టికెట్ రేట్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని మేమూ కోరుకుంటున్నాం" అని చెప్పారు దిల్ రాజు.సినిమా టికెట్ రేట్లను చూపిస్తూ పైరసీ సినిమాలు చూస్తామని చెప్పడం ఏ మాత్రం సహేతుకంకాదని రాజు అన్నారు.మరోవైపు, రవికి మద్దతుగా మీమ్స్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు కొందరు యూజర్లు. శివాజీ సినిమాలో.. రజనీకాంత్ అరెస్టు అయ్యాక పోలీసులు కొడుతున్న సీన్‌ను స్పూఫ్ చేసి.. రవిని కొట్టలేమంటూ చెబుతున్నట్లుగా మీమ్స్ చేసి పెట్టారు కొందరు సోషల్ మీడియా యూజర్లు.మీమ్స్, సోషల్ మీడియాలో రవికి మద్దతుగా పోస్టులు పెట్టడాన్ని స్వయంగా హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో ప్రస్తావించారు."అతను సినిమాలు పైరసీ చేసి ఉచితంగా మీకు చూపిస్తున్నారని అనుకుంటున్నారు. కానీ, వెబ్‌సైట్ల ద్వారా మీ వ్యక్తిగత డాటాను తీసుకోవడంతో సైబర్ క్రైమ్స్, ఏదో ఒక క్రైమ్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది" అని చెప్పారు.సమాచారం అంతా డాటా వెబ్‌లో ఉంటుందని, సైబర్ నేరగాళ్లు డాటా వాడుకునే అవకాశం ఉందంటూ హెచ్చరించారు సజ్జనార్.రవి అరెస్టుపై సినీ ప్రముఖులు స్పందించారు. పైరసీ కారణంగా సినీ పరిశ్రమ ఎంతో నష్టపోతోందని చెప్పారు."నకిలీ విత్తనాలు, నకిలీ మందులు ఎలా హానికరమో, పైరసీ సినిమాలు అదే స్థాయిలో హానికరం. ఉచితంగా సినిమాలు చూస్తున్నామని జనం భావిస్తున్నారు. కానీ, దాని చాటున వ్యక్తిగత డాటాను వారు సేకరిస్తున్నారు. ఈ విషయం గుర్తించాలి" అని బీబీసీతో చెప్పారు నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు.ఐబొమ్మ రవి సినిమా పైరసీ కాపీలను వెబ్‌సైట్లలో పెడుతున్నాడనీ, వేరొకరి సొత్తును చోరీ చేస్తున్నాడనీ అన్నారాయన. ఈ విషయంలో అతనేమీ రాబిన్ హుడ్ కాదని అభిప్రాయపడ్డారు.తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ యాంటీ పైరసీ సెల్ నుంచి సినిమా పైరసీకి వ్యతిరేకంగా పోరాడుతున్నట్లుగా చెప్పారు నిర్మాత దిల్ రాజు."ప్రతి సినిమాకు ఎంతో కష్టం ఉంటుంది. దాన్ని ఇల్లీగల్‌గా చూడటం మానేసి మూడు వారాల తర్వాతనో, నాలుగు వారాల తర్వాతనో ఓటీటీలో కూడా చూడొచ్చు" అని దిల్ రాజు చెప్పారు.లైట్‌మెన్ నుంచి థియేటర్ బయట వాచ్‌మెన్ వరకు ఎంతోమంది సినీ ఇండస్ట్రీ మీద ఆధారపడి జీవిస్తున్నారని నటుడు చిరంజీవి అన్నారు. అలాంటివారి శ్రమను దోచుకోవడం సరికాదని చెప్పారు.ఐబొమ్మ రవి అరెస్టు సినిమా సూపర్ హిట్ సీన్‌లా ఉందని దర్శకుడు రాజమౌళి అన్నారు. తనను పట్టుకోలేరని ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకులు పెట్టిన పోస్టును ప్రస్తావించారు.వారు సవాల్ చేస్తే, పోలీసులు చాలెంజింగ్‌గా తీసుకుని రవిని అరెస్టు చేశారని అన్నారు రాజమౌళి."ఏదీ ఉచితంగా రాదు. సినిమాలు ఉచితంగా చూస్తున్నామని ప్రజలు అనుకుంటున్నారు.

# ఏపీలో మరో కొత్త నియోజకవర్గాలు

## కేంద్రం గ్రీన్ సిగ్నల్

విజయవాడ, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

ఏపీలో నియోజకవర్గాల పునర్విభజనపై మరోసారి చర్చ ప్రారంభం అయింది. బీహార్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించింది. దీంతో కేంద్ర ప్రభుత్వపరంగా నిర్ణయాలు శరవేగంగా తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా జమిలీ ఎన్నికలతో పాటు నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే రాజకీయంగా ముందుగా ఎన్డీఏ పక్షాలకు ప్రయోజనం కల్పించే విషయాలను మాత్రమే పెద్దపీట వేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా అన్ని రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన పూర్తి చేస్తే రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని అంచనా వేస్తోంది. ఇదే గాని జరిగితే ఏపీలో 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉంది. విభజన సమయంలోనే రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. అయితే విభజన జరిగి పుష్కరకాలం అవుతోంది. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. అయితే ఇప్పుడు ఎన్డీఏ కూటమిలో టిడిపి కీలక భాగస్వామి కావడం.. రాజకీయంగా అనుకూలమైన వాతావరణం ఉండడంతో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం పూనుకుంటుందన్న టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 25 పార్లమెంటు స్థానాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మరో 50 అసెంబ్లీ సీట్లు పెరిగే అవకాశం ఉంది. 225 అసెంబ్లీ సీట్లు వరకు వచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. పార్లమెంట్ స్థానాలకు సంబంధించి ఐదు నుంచి ఏడు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే దాదాపు మరో 6 పదవులు పెరిగే అవకాశం ఉంది. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా చాలామంది అవకాశాలు కోల్పోయారు. అటువంటివారు పునర్విభజనతో కొత్త నియోజకవర్గాల ఏర్పాటు అవుతుందని భావిస్తున్నారు. తమకు తప్పకుండా ఛాన్స్ వస్తుందని అంచనా వేస్తున్నారు.వాస్తవానికి దేశంలో జన గణన జరగాల్సి ఉంది. చివరిసారిగా 2011 లో జరిగింది. ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరగడం ఆనవాయితీగా వస్తోంది. కానీ 2021లో జరగాల్సిన జనగణన కరోనా కారణంగా వాయిదా పడింది. ఇప్పటివరకు జనగణన పూర్తి చేయలేకపోయారు. అది జరిగితే కానీ కులగనన చేయలేరు. అయితే ఇప్పుడు జనగణన జరిగితే కానీ నియోజకవర్గాల పునర్విభజన చేయలేరని వార్తలు వచ్చాయి. అయితే దేశంలో ప్రజల కోసం ఎప్పుడైనా పాలనాపరమైన అంశాల్లో చేర్పులు మార్పులు చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోంది. అందుకే ఇప్పుడు జనగనన లేకుండానే నియోజకవర్గాల పునర్విభజన చేయవచ్చని అంశం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమికి అనుకూల వాతావరణం ఉండడంతో నియోజకవర్గాల పునర్విభజన చేయవచ్చని వార్తలు వస్తున్నాయి.అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఏపీ నుంచి బిజెపి ఆరు ఎంపీ సీట్లను పొత్తులో భాగంగా తీసుకుంది. అసెంబ్లీ సీట్ల పరంగా 10 సీట్లు మాత్రమే తీసుకున్న బిజెపి.. పార్లమెంట్ స్థానాల విషయానికి వచ్చేసరికి సింహభాగం ప్రయోజనాలను కోరింది. ఇప్పుడు కూడా పునర్విభజన ద్వారా పార్లమెంట్ సీట్లు పెరిగితే అది బిజెపికి లాభం. తప్పకుండా చంద్రబాబు పార్లమెంట్ స్థానాలైతే ఇట్టే ఇచ్చేస్తారు. రాష్ట్రంలో అధికారంలో ఉండడం చంద్రబాబుకు ముఖ్యం. కేంద్రంలో అధికారంలోకి రావడం బిజెపికి ప్రధానం. అందుకే పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా రెండు పార్టీలు అడుగులు వేస్తాయి. సహకరించేందుకు జనసేన సైతం సిద్ధంగా ఉంది. దీంతో పునర్విభజన జరిగి తీరుతుందని సంకేతాలు వస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# కావేరి ..సూపర్

## సెహభాష్ అంటూ లోకేష్ కితాబు

రాజమండ్రి, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

చేసే పని ఏదైనా అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు దానంతట అదే వస్తుందంటారు. ఎక్కడో మూలన ఉన్నా కూడా మనం చేసే మంచి పని అదే పదిమందిలో సైతం గుర్తింపును తీసుకువస్తుందంటారు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఇష్టం, వినూత్న విద్యాబోధన చేయాలన్న తాపత్రయం, అంతకుమించి ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని కార్పోరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలన్న సంకల్పం.. వెరసి ఆ ఉపాధ్యాయురాలికి మరింత పట్టుదలన తీసుకువచ్చాయి. అందుకే కృత్యాధార విద్యాబోధనతో బట్టీపట్టించడానికి పూర్తిగా స్వస్తి పలికించి వారికి అర్థమయ్యే రీతిలో ఆటపాటల ద్వారా పాఠాలు చెబుతూ పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. ఆమె అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పురపాలక సంఘ పరిధిలో గొల్లపుంత శ్రీ శారద మున్సిపల్ ప్రైమరీ స్కూల్ టీచర్ అమలదాసు కావేరి.. మండపేటలోని గొల్లపుంత వద్దనున్న శ్రీశారద మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో ఏడాది క్రితం వరకు అసలు విద్యార్థులు లేక మూతపడే పరిస్థితి వచ్చిపండింది. సరిగ్గా అదే సమయంలో సింగిల్ టీచర్‌గా అమలదాసు కావేరీ అక్కడ నియమితులయ్యారు పిల్లలు లేరని ఒకింత నిరుత్సాహపడిన ఉన్న ఇద్దరు విద్యార్థులకు వినూత్నంగా విద్యాబోధన సాగించారు కావేరి. దీంతో ఆ పిల్లల సమీపంలోని తల్లిదండ్రులకు ఈ విషయం తెలిసి మా పిల్లల్ని స్కూల్‌కు పంపిస్తామని ముందుకు వచ్చారు. దీంతో ఇప్పుడు 11 మంది విద్యార్థులతో కళకళలాడుతూ కనిపిస్తోంది. పిల్లలు లేక మూతపడే స్థాయి నుంచి అక్కడ చదువుతున్న పిల్లలను చూసిన వారు తమ పిల్లల్ని కూడా ఇక్కడే చేర్పించాలన్నంతగా మార్పు తీసుకువచ్చారు కావేరీ. పిల్లలతో మమేకమై.. వారిలో ఒకరిగా కలిసిపోయి కృత్యాధార బోధనతో ముందుకు నడిపిస్తున్నారామె. ఇలా ఆటపాటలతో వినూత్న పద్దతుల్లో నేర్పిస్తున్న పాఠాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అవి ప్రజల్లోకి వెళ్లడం.. ఆనోటా ఈనోట టీచర్ కావేరీ డెడికేషన్ గురించి తెలియడంతో పిల్లలు రావడం పెరిగింది. ఈ వీడియోలు ఇన్‌స్టా గ్రామ్‌లో వస్తుండడంతో ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వరకు చేరాయి. ఆ టీచర్‌ను అభినందిస్తూ లోకేష్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఉపాధ్యాయురాలు అమలదాసు కావేరి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పురపాలక సంఘ పరిధిలోని గొల్లపుంత శ్రీ శారదా మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారామె.ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన ఎక్స్ ఖాతాలో టీచర్ కావేరి ని ప్రశంసిస్తూ చేసిన ట్వీట్ వైరల్ అయ్యింది. లోకేష్ తన ఎక్స్ ఖాతాలో కావేరి విద్యార్థులతో ఆడి పాడుతూ బోధిస్తున్న వీడియోను షేర్ చేస్తూ



"ప్రయత్నమే తొలి విజయం. జీరో అడ్మిషన్ ఉన్న స్కూల్‌ని 11 విద్యార్థులతో నడిపిస్తున్న కావేరికి అభినందనలు. పిల్లల వయసు, ఆలోచనలకు తగ్గట్లు వినూత్నమైన బోధనా పద్దతులతో పాఠాలు చెబుతున్న తీరు చాలా బాగుంది.. ఆటపాటలతో చదువు నేర్పిస్తూ నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలు, దేశభక్తిని బోధించడం చాలా సంతోషం, ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం రీల్స్ తయారు చేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం ప్రశంసనీయం పర్యవరణ పరిరక్షణ లక్ష్యంగా కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేసిన మీ కృషి చాలా మందికి స్ఫూర్తినిస్తుందని అంటూ అభినందించారు..

**బోధనలోనూ ప్రత్యేక శైలిలో..**

మండపేట గొల్లపుంతలోని శ్రీ శారద మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సింగిల్ టీచర్‌గా పనిచేస్తున్న కావేరి పిల్లలకు తనదైన శైలిలో పాఠాలు చెప్పడమే కాకుండా నైతిక విలువలు, సాంస్కృతిక సాంప్రదాయాలు, దేశభక్తి భావాలు కూడా బోధిస్తున్నారు. కేవలం బోధనకే పరిమితం కాకుండా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పిల్లలతో ఆటపాటల ద్వారా పాఠాలు నేర్పించే ఆమె రీల్స్ ఇప్పుడు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. అంతే కాకుండా ఆడపిల్లలపై జరుగుతోన్న అఘాయిత్యాలపై అప్రమత్తం చేస్తూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లల్ని అప్రమత్తం చేయడం, వారిలో ప్రతీ అంశంపై విషయ పరిజ్ఞానాన్ని సమపార్జన చేసేలా బోధించడం ఈ టీచర్ ప్రత్యేకం అంటూ విద్యార్థులు తల్లితండ్రులు కావేరీను అభినందనలతో ముంచెత్తుతున్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ తన ప్రయత్నాన్ని అభినందిస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేయడంపై సంతోషం వ్యక్తంచేశారు టీచర్ కావేరి.. పిల్లలకు బట్టీపట్టే విధానాన్ని స్వస్తి పలికించి వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పడం ద్వారా వారిలో మరింత విజ్ఞానం, ఉత్సాహం కలుగుతుందని, అందుకే పిల్లలు స్కూల్‌కు చాలా ఉత్సాహంగా వస్తున్నారని తెలిపింది. లోకేష్ ట్వీట్ తర్వాత శారద మున్సిపల్ స్కూల్ కోసం సోషల్ మీడియాలో మంచి గుర్తింపు లభించింది..

# సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు

**-బాసర శాంతి భద్రతల పై ఎస్పీ స్వీయ పర్యవేక్షణ**

**-బాసరలో ప్రస్తుతం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేవు - సోషల్ మీడియా లో వస్తున్న అసత్య ప్రచారాలు నమ్మొద్దు**



ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా బ్యూరో, నవంబర్ 19 (భారత శక్తి): బయట నుండి వచ్చి చేసే అల్లరి మూకల పనులకు బాసర యువత బలి కావొద్దు" %-% ఎస్పీ అన్నారు.సామాజిక ఐక్యతకు భంగం కలిగించే విధంగా ఎవ్వరు మాట్లాడినా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల హెచ్చరించారు. నిర్మల్ జిల్లా బాసరలో శివాజీ మహారాజ్ గారి గురించి సోషల్ మీడియాలో ఒక యువకుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్థానికంగా ఉద్రిక్తతలు నెలకొన్న సందర్భంగా, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ నిన్న స్వయంగా బాసర చేరుకుని పరిస్థితిని దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ పరిస్థితిని పూర్తిగా అదుపులో ఉంచేందుకు, ఈరోజు కూడా ఎస్పీ బాసరలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పికెట్లను స్వయంగా సందర్శించి శాంతి భద్రతా ఏర్పాట్లనులి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం బాసరలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేవు. మొత్తం అంతా కూడా శాంతియుతంగా ఉంది. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు కథనాలను చూసి ఎవరూ ఉద్రేకపడకూడదని, అందరూ సంయమనం పాటించాలని ఎస్పీ సూచించారు.అమ్మవారి దర్శనార్థం ప్రతిరోజూ వేలాది భక్తులు వచ్చే బాసర లిపవిత్ర ప్రాంతం యొక్క ప్రశాంతమైన పేరును చెడగొట్టే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. అంతే కాకుండా బయట నుంచి వచ్చే అల్లరి మూకల పనులకు బాసర యువత బలి కావొద్దని ఎస్పీ పిలుపునిచ్చారు." "సామాజిక ఐక్యతను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ విభాగం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం," అని హెచ్చరించారు.

# ఉలిక్కపడ్డ అనకాపల్లి..

## ఇద్దరు విదేశీయుల సంచారం.. కట్‌చేస్తే.

విశాఖపట్టణం, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

అనకాపల్లిలో తీవ్ర కలకలం రేగింది. అనుమాన్నాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు బంగ్లాదేశీయులను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. కాకినాడ నుంచి వెళ్తుండగా పట్టుకున్నారు. నిఘా వర్గాల కీలక సమాచారం ఇవ్వడంతో అనకాపల్లి పోలీసులు అలర్ట్ అయ్యారు. పట్టుబడిన వారిలో ఒక వ్యక్తి, బాలిక ఉన్నారు. బంగ్లాదేశ్ బోర్డర్ దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. తీవ్ర కలకలం సృష్టించిన ఘటనతో అనకాపల్లి ఉలిక్కిపడింది.అనకాపల్లిలో తీవ్ర కలకలం రేగింది. అనుమాన్నాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు బంగ్లాదేశీయులను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. కాకినాడ నుంచి వెళుతుండగా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో ఓ వ్యక్తి, బాలిక ఉన్నారు. అనకాపల్లి పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నిఘా వర్గాల సమాచారంతో ఓ బాలిక, మరో వ్యక్తి అనకాపల్లి రైల్వే స్టేషన్ పాత బుకింగ్ కౌంటర్ వద్ద ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వ్యక్తి పేరు విక్రమ్ అలీ అలియాస్ మహమ్మద్ తయ్యుబ్‌గా పోలీసులు గుర్తించారు. ఇతను 2012లో భారత్‌లోకి చొరబడ్డాడు. ఉత్తర ప్రదేశ్ అలీగడ్‌లో 10 ఏళ్లపాటు నివాసమున్నాడు. ఆ తర్వాత కాకినాడకు మకాం మార్చిన తయ్యాబ్.. మూడేళ్లుగా కాకినాడలోనే నివాసం ఉంటున్నాడు బంగ్లాదేశీ బాలికను పెళ్లి చేస్తానని నమ్మించి బోర్డర్ దాటించాడు తయ్యుబ్. ఆ తరువాత ఆమెను తీసుకోచ్చి రెండు నెలలుగా కాకినాడలోని బంధించాడు. ఈ విషయం తెలుసుకున్న నిగా వర్గాలు ఇద్దరి కదలికలను గమనించారు. వారు కాకినాడ నుంచి అనకాపల్లి వరకు వచ్చినట్టు తెలుసుకొని అనాపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. విక్రమ్ అలియాస్ తయ్యుబ్ సహా ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. విచారించి అసలు విషయాన్ని తెలుసుకున్నారు.తయ్యుబ్ పై ఫోక్సో, ఫారినర్ యాక్ట్, పాస్పోర్ట్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి సిఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. అలాగే అతన్ని కోర్టులో హాజరుపర్చగా కోర్టు తయ్యుబ్‌కు 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు. బాలికను చిల్డ్రన్స్ హోమ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో మరికొంత సమాచారం సేకరించేందుకు నిందితుడిని కస్టడీకి తీసుకొనే అంశాన్ని పరిశీలిస్తున్నామని పోలీసులు చెప్పుకొచ్చారు.

# శాశ్వత వరద రహిత నగరంగా అమరావతి

విజయవాడ, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

అమరావతిని శాశ్వత వరద రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. అందులో భాగంగా రూ. 2062 కోట్ల అంచనా వ్యయంతో.. గతంలోనే వరద నిర్వహణ పనుల డిజైన్లకు ఆమోదం తెలిపింది. తాజాగా, రూ. 595 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. 8,400



క్యూసెక్కుల గరిష్ఠ సామర్థ్యంతో దీన్ని నిర్మించనున్నారు. గతంలో మొదటి పంపింగ్ స్టేషన్‌ను ఉండవల్లి ప్రాంతంలో నిర్మించిన సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిని శాశ్వత వరద రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. అందుకోసం అమరావతిలో వరద నిర్వహణ పనులకు రూ. 2062 కోట్ల అంచనా వ్యయంతో డిజైన్లకు ఆమోదం తెలిపింది. టీడీపీ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడే ఈ మేరకు అడుగులు పడ్డాయి. అప్పట్లో 100 సంవత్సరాల వర్షపాతాన్ని ప్రామాణికంగా తీసుకుని.. కొండవీటి వాగు, పాల వాగుల వెడల్పు, లోతులను పెంచాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా మూడు పంపింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచించింది. 2014-19 మధ్య ఉండవల్లి వద్ద మొదటి పంపింగ్ స్టేషన్ నిర్మించారు. తాజాగా ఈ రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎస్) టెండర్లు ఆహ్వానించింది.

అమరావతి వరద నివారణ ప్రణాళికలో భాగంగా ఈ రెండో పంపింగ్ స్టేషన్‌ను రూ. 595 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో పనిచేసే ఈ పంపింగ్ స్టేషన్.. ఉండవల్లి పంపింగ్ స్టేషన్ పక్కనే నిర్మిస్తారు. పంపింగ్ స్టేషన్ నిర్మాణంతో పాటు 15 ఏళ్ల నిర్వహణను కూడా గుత్తేదారు సంస్థ చూసుకునేలా నిబంధనలు పొందుపరిచారు. ఈ రెండో పంపింగ్ స్టేషన్‌లో 6 వేల హార్స్‌పవర్ సామర్థ్యం గల.. 13 మోటార్లు ఉండనున్నాయి.అమరావతికి వరద ముప్పు అరికట్టాలంటే ఈ పంపింగ్ స్టేషన్లు కీలకం కానున్నాయి. కొండవీటివాగు అమరావతి మీదుగా ప్రవహించి ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. వర్షాలు కురిసినప్పుడు అమరావతి ఎగువ ప్రాంతాల నుంచి పాలవాగు వంటి ఇతర చిన్న వాగులు.. కొండవీటి వాగులో కలుస్తాయి. అయితే కృష్ణా నదికి వరద లేనప్పుడు.. కొండవీటి వాగులో ఎంత ప్రవాహం వచ్చినా నదిలోకి వెళ్లిపోతుంది. కృష్ణాలో కూడా వరద నీరు భారీగా ఉంటే.. కొండవీటి వాగులోకి వెనక్కి తన్నుతుంది. అప్పుడు వరదలు సంభవిస్తాయి.ఇలా రాజధాని ప్రాంతం వరద ముంపుకు గురికాకుండా.. వరద నివారణ ప్రణాళికను ఏపీసీఆర్‌డీఏ తయారు చేసింది. మిగతా వాగులు, వంకల నుంచి కొండవీటి వాగు వచ్చే వరదను గరిష్ఠంగా 23 వేల క్యూసెక్కులుగా లెక్క గట్టారు. వాటిని కృష్ణా నదిలోకి ఎత్తిపోసేందుకు మూడు పంపింగ్ స్టేషన్లు నిర్మించేందుకు ప్రణాళికలు రచించారు. మొదటి పంపింగ్ స్టేషన్‌ను ఉండవల్లి వద్ద 5,000 క్యూసెక్కుల సామర్థ్యంతో 2019కి ముందే ఏర్పాటు చేశారు. తాజాగా రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు.

మళ్లీ అమరావతి ఉద్యమం

వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో అమరావతి ఎంతలా నిర్వీర్యం అయిందో తెలుసు. ఇప్పటికీ అప్పటి పరిస్థితులను తలుచుకొని ఆందోళనకు గురవుతున్నారు అమరావతి రైతులు. అందుకే మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించి.. ఎవరూ కదిలించలేని స్థితికి చేర్చాలని విన్నవిస్తున్నారు. ఆపై అమరావతిపై వైయస్సార్ కాంగ్రెస్ చేసిన ప్రయోగాల నుంచి విముక్తి కల్పించాలని కూడా కోరుతున్నారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్న అమరావతి రైతులు ఈ విషయంలో మాత్రం.. అవసరం అనుకుంటే ఉద్యమించాలని చూస్తున్నారు. ప్రధాన కారణం నాటి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలే. 2014లో అధికారంలోకి వచ్చింది టిడిపి ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయ్యారు చంద్రబాబు. ఆ సమయంలో అందరి ఏకాభిప్రాయంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు. అయితే పాలన గాడిలో పెట్టేందుకు దాదాపు ఏడాది పట్టింది. ఎందుకంటే అది విభజిత ఆంధ్రప్రదేశ్ కాబట్టి. ఏపీకి రాజధాని లేదు. ఎక్కడి నుంచి పాలన చేయాలో తెలియదు. అటువంటి సమయంలో పాలనను గాడిలో పెట్టి.. అమరావతి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆపై రాజకీయపరంగా ఎన్నెన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐదేళ్ల పాలనాకాలం ఇట్టే ముగిసిపోయింది. అయితే రాజధానిని ఎంపిక చేసి పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు దానికి చట్టబద్ధత కల్పించలేకపోయారు. దీంతో తరువాత అధికారంలోకి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ అమరావతి తో ఎంతలా ఆడుకోవాలో అంతలా ఆడుకుంది.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల అంశం తెరపైకి వచ్చింది. కేవలం శాసన రాజధానిగా మాత్రమే అమరావతిని పరిమితం చేసింది వైసిపి ప్రభుత్వం. దీంతో అమరావతికి సేకరించిన వేల ఎకరాలను తిరిగి రైతులకు ఇవ్వలేదు. అలాగని మూడు రాజధానులు కట్టలేదు. అయితే ఆర్ 5 జోన్ అంటూ అమరావతి రైతులు ఇచ్చిన భూములను పేదలకు పని చేసేందుకు నిర్ణయించింది కూటమి ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న పేదలకు అమరావతిలో ప్లాట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఆర్5 జోన్ కేటాయింపులను రద్దు చేయాలని అమరావతి రైతులు కోరుతూ వచ్చారు. కానీ ఇంతవరకు కూటమి ప్రభుత్వం నుంచి చలనం లేదు. దీంతో వైసిపి హయాంలో యాక్టివ్ గా పని చేసిన అమరావతి ఐక్య కార్యాచరణ సమితి మరోసారి క్రియాశీలకం అయింది. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని చూస్తోంది.గతంలో చట్టబద్ధత కల్పించి ఉంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతిని కాదని.. మూడు రాజధానులను అస్సలు తెరపైకి తెచ్చే అవకాశం లేదని నమ్ముతున్నారు అమరావతి రైతులు. అయితే అప్పట్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా చట్టబద్ధత కాలేదు. కనీసం ఇప్పుడైనా చట్టబద్ధత కల్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు రావని అమరావతి రైతులు భావిస్తున్నారు. పైగా ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి. ఏపీ విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరిస్తోంది. ఇటువంటి సమయంలో అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే చాలా ప్రయోజనం అని అమరావతి రైతులు భావిస్తున్నారు. ఒత్తిడి పెంచేందుకు అమరావతి ఐక్య కార్యాచరణ సమితి రంగంలోకి దిగింది. చూడాలి కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో.

# జగన్ ఫ్యూచర్ ప్లాన్ ఏంటీ

కడప, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి భయపడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీహార్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డి పెద్దగా మాట్లాడలేదు. ఆపై తెలంగాణలో సైతం ఆయనకు మింగుడు పడని ఫలితాలు వచ్చాయి. బీహార్లో ఎన్డీఏ కూటమి.. తెలంగాణలో కాంగ్రెస్ కు అనుకూల ఫలితాలు రావడం పై జగన్మోహన్ రెడ్డి ఆందోళనతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి ఏ కూటమిలో కూడా లేరు. జాతీయస్థాయిలో ఎన్డీఏ బలంగా ఉండగా.. ఇండియా కూటమి బలహీనం అవుతోంది. అయితే తక్కువ పార్టీలు ఉన్న ఎన్డీఏ ఎక్కువ బలంతో ఉంది. ఎక్కువ పార్టీలు ఉన్న ఇండియా కూటమి మాత్రం బలహీనంగా ఉంది. అయితే జాతీయస్థాయిలో ఇప్పుడు తెలుగుదేశం క్రియాశీలకంగా ఉంది. అందుకే ఏదో ఒక కూటమిలో చేరాల్సిన అనివార్య పరిస్థితి జగన్మోహన్ రెడ్డిలో ఉంది. అయితే మొన్నటి బీహార్ ఎన్నికలతో తాను ఏ కూటమిలో చేరాలన్న దానిపై ఒక క్లారిటీ కోసం ఎదురు చూస్తూ వచ్చారు జగన్మోహన్ రెడ్డి. మరోవైపు మిత్రుడు కేసీఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ద్వారా పుంజుకుంటారని ఆశించారు. అయితే బీహార్ లో ఎన్డీఏ అధికారంలోకి రావడంతో ఇండియా కూటమి మరింత బలహీనమైంది. తెలంగాణలో కెసిఆర్ పార్టీ ఓడిపోవడంతో ఆప్షన్ లేకుండా పోయిందిరాజకీయంగా ఎటువంటి నిర్ణయం తీసుకునే పరిస్థితుల్లో లేరు జగన్మోహన్ రెడ్డి. ఒకవేళ బీహార్ లోఇండియా కూటమి గెలిచి ఉంటే.. కర్ణాటక కాంగ్రెస్ ద్వారా రాజకీయం నడిపేందుకు జగన్ సిద్ధపడ్డారు. బెంగళూరు నుంచి తనదైన రాజకీయాలు నడిపి జాతీయస్థాయిలో ఇతర పార్టీల మద్దతుతో నెగ్గుకు రావాలని భావించారు. మరోవైపు బీహార్లో తేజస్వి యాదవ్ లాంటి నేతలను కలుపుకొని జాతీయస్థాయిలో సైతం చక్రం తిప్పాలని భావించారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తో జగన్మోహన్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. అలాగే పక్క రాష్ట్రమైన తమిళనాడు సీఎం స్టాలిన్తో సైతం సన్నిహితంగానే గడుపుతూ వచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే తేజస్వి యాదవ్, అఖిలేష్ యాదవ్, స్టాలిన్, కేటీఆర్, ఒడిస్సాలో నవీన్ పట్నాయక్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్



సీఎం మమతా బెనర్జీ వంటి వారితో జత కలవాలని చూశారు. కానీ ఇప్పుడు బీహార్ ఎన్నికలతో పునరాలోచనలో పడ్డారు. ఇప్పుడే జాతీయస్థాయిలో పావులు కదిపితే బిజెపి పెద్దల ఆగ్రహానికి గురికాక తప్పదని భయపడుతున్నారు.వాస్తవానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేయని ప్రయత్నం అంటూ లేదు. 2019లో టిడిపి దారుణంగా ఓడిపోయింది. కేవలం బిజెపితో కటీఫ్ చెప్పడం వల్లే తమకు ఈ పరిస్థితి ఎదురైందని చంద్రబాబు గుర్తించారు. అందుకు అవసరమైన కార్యాచరణను ప్రారంభించారు. వెంటనే టిడిపి రాజ్యసభ సభ్యులు కూడా బిజెపిలోకి వెళ్లిపోయారు. అదే సమయంలో బిజెపికి కోపం వచ్చి ఎటువంటి పని కూడా చంద్రబాబు చేయలేదు. అయితే చంద్రబాబుతో పోల్చుకుంటే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి బిజెపికి దగ్గర ఎందుకు చేసిన ప్రయత్నాలు ఏవి వర్కౌట్ కాలేదు. అలాగని అప్పట్లో చంద్రబాబు విషయంలో బిజెపియేతర పార్టీలు సైతం సానుకూలంగా ఉండేవి. ఏపీలో ఉన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నడుమ చంద్రబాబు అలా ప్రవర్తించేసరికి వారు కూడా సర్దుబాటు చేసుకున్నారు. అయితే బిజెపికి చంద్రబాబు దగ్గరైనా.. ఏపీలో మాత్రం మిగతా రాజకీయ పక్షాలు అంతర్గతంగా చంద్రబాబు వైపే నిలబడ్డాయి. జగన్మోహన్ రెడ్డిని ఒక్క పార్టీ అంటే ఒక్క పార్టీ కూడా సమర్థించలేదు. ఇప్పుడు అదే చంద్రబాబు ఎన్డీఏ లో ఉన్న.. దాని వ్యతిరేక కూటమి అయిన ఇండియా కూటమికి చెందిన ఏపీ నేతలు ఎవరు చంద్రబాబును వ్యతిరేకించడం లేదు. అలాగని జగన్మోహన్ రెడ్డిని సమర్థించడం లేదు. ఇది ఒక విధంగా జగన్మోహన్ రెడ్డికి సంకట స్థితి అని చెప్పవచ్చు.

----------------

# పరకామణి కేసును తవ్వుతున్న టీటీడీ



తిరుమల, ననవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మంగళవారం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గతంలో పెదజీయర్ మఠం ఉద్యోగి రవికుమార్ 900 అమెరికన్ డాలర్ల దొంగిలించిన కేసును లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకుని, ఆ రాజీ భాగంగా 14.5 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల్ని టీటీడీకి విరాళంగా ఇచ్చిన వ్యవహారం వెనుక ఉన్న లోతైన కుట్రను పూర్తిగా బయటపెట్టేందుకు కొత్త క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయాలని బోర్డు ఏకగ్రీవంగా తీర్మానించింది. పెదజీయర్ మఠం ఉద్యోగి రవికుమార్ పరకామణి విభాగంలో విదేశీ కానుకలు లెక్కించే బాధ్యతల్లో ఉండేవారు. ఒక వ్యక్తి హుండీలో పడిన విదేశీ కరెన్సీని దొంగిలించడంతో టీటీడీ విజిలెన్స్ విభాగం పట్టుకుని అతనిపై కేసు పెట్టింది. కానీ కేసు విచారణలో ఉండగానే లోక్‌అదాలత్‌లో రాజీకి చేసుకున్నారు. ఆ వ్యక్తి నుంచి 14.5 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల్ని టీటీడీకి విరాళంగా తీసుకున్నారు. అప్పటి బోర్డు దాన్ని అంగీకరించింది. కానీ "కేవలం 75 వేల రూపాయల దొంగతనం కోసం 14.5 కోట్ల భూమి ఎందుకు ఇచ్చాడు?" అనే ప్రశ్న ప్రస్తుత టీటీడీ బోర్డుకు వచ్చింది. ప్రస్తుతం ఈ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణలోకి ఉంది. 2025 అక్టోబర్ 7న హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీ సీఐడీ డీజీపీ పూర్తి విచారణ జరిపి సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇదే అంశం మరో రెండు కేసుల్లోనూ ప్రస్తావనకు వచ్చింది. ఇంతలో ఈ రాజీకి కారకుడైన అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సతీష్ అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఈ కేసులో మరిన్ని అనుమానాలు బలపడుతున్నాయి. అందుకే మంగళవారం టీటీడీ ట్రస్ట్ బోర్డు సమావేశంలో ఈ విషయం లోతుగా చర్చించారు. పాత కేసు తిరిగి తెరిచినా విచారణ పరిధి చాలా పరిమితం అవుతుందని, అందువల్ల కుట్ర మొత్తం బయటపడదని బోర్డు గుర్తించింది. అందుకే కొత్తగా క్రిమినల్ ఫిర్యాదు చేసి, ఈ రాజీ వెనుక ఉన్న ముసుగులు తొలగించాలని, గతంలో దాచిపెట్టిన ఇతర దొంగతనాలు, దుర్వినియోగాలు కూడా బయటపడేలా చూడాలని నిర్ణయించారు. 2023 సెప్టెంబర్ 9న తిరుపతి కోర్టులో జరిగిన లోక్‌అదాలత్ రాజీని "కుట్రపూరితమైనది" అంటూ పూర్తిగా పక్కన పెట్టేందుకు కూడా బోర్డు సిద్ధమైంది. ఈ చర్య వల్ల ఒకే నేరానికి రెండుసార్లు శిక్ష ఆరోపణ రాకుండా జాగ్రత్తగా తీసుకుంటున్నామని బోర్డు స్పష్టం చేసింది. స్వామివారి హుండీలో పడిన ప్రతి రూపాయి దేవుడిదే, భక్తుల విశ్వాసం దేవుడి మీద ఉందని, ఆ విశ్వాసాన్ని దెబ్బతీసే ఏ చర్యనూ సహించబోమని బోర్డు ప్రకటించింది. ఈ నిర్ణయం పూర్తిగా పరిపాలనాపరంగా, భక్తుల భావాలను, సనాతన ధర్మ పవిత్రతను కాపాడే ఉద్దేశంతోనే తీసుకున్నామని బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరికి 25 లక్షల హెల్త్ కవరేజీ

విజయవాడ, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని సంక్రాంతి నుంచి అమలు చేయనున్నారు. జనవరి 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వస్తున్న ఈ పథకం ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కవరేజీ అందించనుంది. పేదలకు ప్రత్యేక వరంగా రూ.5 లక్షల వార్షికాదాయం లోపు కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుంది. ఈ పథకంతో రాష్ట్రంలోని 1.43 కోట్ల పేద కుటుంబాలకు మేలు చేకూరుతుందని మొత్తం 5 కోట్ల మంది ప్రయోజనం పొందుతారని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ విజయ్ కుమార్ ప్రకటించారు. ప్రస్తుతం 'డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ' పథకం అమల్లో ఉంది. ఈ పథకం కింద 24 గంటల్లో అందించే ఉచిత వైద్య సేవలను ఈ కొత్త భీమా పథకం ద్వారా 6 గంటల్లోపు అందించనున్నారు. ప్రస్తుతం 3,257 రకాల సేవలు అందుతున్నాయి. కొత్త విధానంలో కూడా ఇవి కొనసాగుతాయి. ఇది కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేసి, నిధఉలు దుర్వినియోగం కాకుండా సమర్థవంతంగా వినియోగించేలా రూపొందించారు. ఈ పథకం ప్రజలకు వరం అని విజయ్ కుమార్ చెబుతున్నారు. అందరికీ ఆరోగ్య రక్షణను హామీ ఇస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.25 లక్షల ఆరోగ్య భీమా అందుతుంది. ముఖ్యంగా, వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉన్న పేద కుటుంబాలకు బీమా సంస్థల ద్వారా రూ.2.50 లక్షల వరకు నగదురహిత చికిత్స అందుతుంది. ఈ పథకంతో 1.43 కోట్ల పేద కుటుంబాలు, మొత్తం 5 కోట్ల ప్రజలు ప్రయోజనం పొందుతారు. ఇది రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. ప్రధాన ఆరోగ్య కేంద్రాల (ఖఊఅ) , పట్టణ ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి రూ.194 కోట్లు కేటాయించారు. ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ నేతృత్వంలో 30 పాయింట్ల ఆరోగ్య సంస్కరణలు అమలులో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రజలకు వేగంగా అందించాలని అధికారులకు సూచించారు. "సంక్రాంతి నుంచి ప్రతి పేదవారి ఇంటి ముందు ఆరోగ్య రక్షణ హామీ" అంటూ ప్రభుత్వం ప్రచారం కూడా చేస్తోంది. ప్రజలు ఈ పథకం గురించి మరిన్ని వివరాల కోసం స్థానిక ఆరోగ్య కేంద్రాలు లేదా టోల్ ఫ్రీ నంబర్ 104కు సంప్రదించవచ్చు. ఈ పథకం రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థకు మైలురాయిగా మారనుందని, పేదలకు నిజమైన వరం అవుతుందని విజయ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# లొంగిపోవాలానుకోనే లోపే ఎన్ కౌంటర్

విజయవాడ,నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా ఎన్కౌంటర్ తర్వాత సంచలన అంశాలు బయటికి వస్తున్నాయి. లొంగిపోయే ప్రయత్నాల్లో ఉండగానే హిడ్మా, అతని భార్య ఎన్‌కౌంటర్ అయ్యారు. కొద్దిరోజుల క్రితమే ఆయుధాలను అడవిని వదిలేసి హిడ్మా జనజీవ స్రవంతిలో కలవాలనుకున్నారు. ఈలోపే ఏపీ పోలీసుల కాల్పుల్లో మోస్ట్ వాంటెడ్ మడవి హిడ్మా హతమయ్యారు. కొద్దిరోజుల క్రితం ఛత్తీస్‌ఘడ్ బస్తర్‌లో ఉన్న ఒక విలేఖరికి హిడ్మా లేఖ రాశారు.. ఆయుధాలు విడిచే ముందు తాను కొన్ని అంశాలపై చర్చించాలనుకున్నట్లు జర్నలిస్టుకి రాసిన ఆ లేఖలో పేర్కొన్నారు. తమ భద్రతకు భరోసా కల్పిస్తే సరెండర్ అయ్యేందుకు సిద్ధం అన్నట్లు ఆ లేఖ సారాంశం ఉంది. లొంగుబాటుకు సంబంధించి ఎక్కడ..? ఏ ప్రదేశం అన్నది నిర్ణయించాల్సి ఉందని ఆ లేఖలో హిడ్మా పేర్కొన్నారుతనను కలిసేందుకు ఆంధ్రప్రదేశ్ కు రావాల్సిందిగా ఆ జర్నలిస్టును హిడ్మా కోరారు. హిడ్మా నవంబర్ 10 న ఈ లేఖ రాసినట్లు ఆలస్యంగా బయటపడింది.. అయితే అందరూ లొంగిపోయేందుకు సిద్ధంగా లేరని సైతం ఆ లేఖలో పేర్కొన్నారు.తన ఆలోచనలతోపాటు నిర్ణయాలపై వీడియో రిలీజ్ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు విలేఖరికి రాశారు. నాలుగైదు రోజుల్లో హిందీతో పాటు తెలుగులోనూ ఒక ఆడియో స్టేట్మెంట్ ఇవ్వనున్నట్లు కూడా ఆ లేఖలో ఉంది. ఆయుధాలు విడిచే ముందు కొన్ని అంశాలు చర్చించాల్సి ఉందని లేఖలో సుదీర్ఘంగా హిడ్మా రాసినట్లు తెలుస్తోంది.ఇంతలోనే ఏపీ బలగాల చేతిలో హిడ్మా ఎన్కౌంటర్‌కు గురయ్యారు. మరోవైపు హిడ్మా ఎన్కౌంటర్ తోపాటు.. మావోయిస్టుల అరెస్టుపై ఏపీ పోలీసులు ఈరోజు అధికారికంగా ప్రకటించనున్నారు.

## ప్రధాని మోదీ వాచ్ ఖరీదు ఎంతో తెలుసా

# ఇండియా చిహ్నాలుతో తయారీ

న్యూఢిల్లీ, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)


ప్రధాని మోదీ ఇటీవల పాల్గొన్న అనేక బహిరంగ కార్యక్రమాల్లో ఆయన ధరించిన చేతి గడియారం ఇప్పుడు నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. దీంతో అది ఏ వాచ్ అని అంతా సెర్చ్ చేస్తున్నారు. ఆ వాచ్‌లో నడుస్తున్న పులితోపాటు 1947 నాటి రూపాయి నాణెం కూడా ఉంది. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో తయారు చేసిన ఈ వాచ్ ధర ఎంత ఉంటుంది. దాన్ని ఏ కంపెనీ తయారు చేసింది. ఆ వాచ్ విశేషాలు ఏంటి అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఇటీవల బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. రోడ్ షోలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధరించిన రిస్ట్‌వాచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. జైపూర్ వాచ్ కంపెనీ తయారు చేసిన ఈ టైమ్‌పీస్ పేరు 'రోమన్ బాగ్'. ఇది కేవలం ఒక వాచ్ మాత్రమే కాకుండా.. భారతీయ కళాత్మకత, వారసత్వం, మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ రోమన్ బాగ్ వాచ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది దాని డయల్. దీని మధ్యలో 1947 నాటి అసలు ఒక రూపాయి నాణెం ఉంటుంది. ఈ నాణెంపై భారతదేశపు ప్రత్యేక చిహ్నం అయిన నడుస్తున్న పులి బొమ్మ కూడా ముద్రించబడి ఉంది. ఈ వాచ్‌లోని నాణెంపై ఉన్న 1947 సంవత్సరం.. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన సంవత్సరాన్ని సూచిస్తుంది. ఇది భారతదేశం తనదైన గుర్తింపును పెంచుకుంటూ.. స్వయం సమృద్ధి దిశగా వేసిన శక్తివంతమైన అడుగుకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ డిజైన్.. ప్రధాని మోదీ బలంగా సమర్థించే మేక్ ఇన్ ఇండియా నినాదానికి బలమైన మద్దతుగా కనిపిస్తుంది. అంతేకాకుండా ఈ రోమన్ బాగ్ వాచ్‌ను ఆధునిక ఇంజనీరింగ్‌తో రూపొందించారు. ఈ రోమన్ బాగ్ వాచ్ ను మన్నికైన 316ఎల్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన 43 మిల్లీమీటర్ల కేస్‌ను కలిగి ఉంది. దీనిలో మృదువైన పనితీరుకు, రోజువారీ కచ్చితత్వానికి పేరుగాంచిన నమ్మదగిన జపనీస్ మియోటా ఆటోమేటిక్ మూవ్‌మెంట్ ఉపయోగించారు. దీనికి గీతలు పడకుండా ఉండేందుకు ముందు, వెనుక భాగాల్లో నీలమణి క్రిస్టల్స్‌ను ఉపయోగించారు. ఇక ఈ రోమన్ బాగ్



వాచ్ ధర సుమారుగా రూ.55 వేల నుంచి రూ.60 వేల మధ్య ఉన్నట్లు తెలుస్తోంది. గౌరవ్ మెహతా స్థాపించిన ఈ జైపూర్ వాచ్ కంపెనీ.. అరుదైన భారతీయ జ్ఞాపకాలు, నాణేలు, స్టాంపులు, సాంప్రదాయ డిజైన్‌లను లగ్జరీ గడియారాలుగా మార్చడంలో ప్రసిద్ధి చెందింది. వరల్డ్ కంపెనీలు ఆధిపత్యం కొనసాగిస్తున్న ఈ చేతి గడియారం మార్కెట్‌లో.. ఈ జైపూర్ వాచ్ కంపెనీ బ్రాండ్ భారతీయ లగ్జరీ డిజైన్‌కు కొత్త నిర్వచనాన్ని ఇస్తోంది. ఇక ప్రధాని మోదీ ఈ స్వదేశీ బ్రాండ్‌ను ఎంచుకోవడం ద్వారా.. భారత్‌లో పెరుగుతున్న దేశీయ బ్రాండ్ల నాణ్యత, క్రియేటివిటీని ప్రపంచ వేదికపై చాటిచెప్పడానికి సిద్ధంగా ఉన్నాయనే సందేశాన్ని పంపారు.

## అట్టహాసంగా రేజోనేన్స్ ఇంటర్మీడియట్ కళాశాలల రెజో తరంగ్ ఫెస్ట్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి వెల్లడి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్19:



వరంగల్ ములుగు రోడ్డు లోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్లో వరంగల్ జిల్లాలో పేరు గాంచిన రాజస్థాన్ కోటాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థలు రేజోనేన్స్ ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థుల రెజో తరంగ్ 2025 ఫెస్ట్ ను బుధవారం అట్టహాసంగా నిర్వహించినట్లు రేజోనేన్స్ కళాశాలల ఛైర్మెన్ లెక్కల రాజిరెడ్డి మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తులు బయటకు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినిమా హీరో నందు,హీరోయిన్,యామిని భాస్కర్, పోలీసు డిపార్ట్మెంట్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఇలాంటి పార్టీలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో స్నేహభావం,సోదర భావం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హీరో నందు,హీరోయిన్ విద్యార్థులతో కలిసి నృత్యం చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 19:



మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ 108వ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో, సామాజిక న్యాయ సాధనలో, పేదల సంక్షేమంలో ఇందిరాగాంధీ పాత్ర అపారమని గుర్తుచేశారు. ఆమె చూపిన ధైర్యం, దూరదృష్టి, నాయకత్వం నేటికీ దేశానికి ప్రేరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, భావపూర్వక నివాళులు అర్పించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పండ్లరాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంపరి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు కన్నయ్య, ప్రసన్న, చాట్ల రాజేశ్వర్, రాజు, లడ్డు, కాళ్ళ గణేష్, అన్వర్ బాయ్, తేజపు ప్రసాద్. కాళ్ళ గణేష్, నర్సింలు, ఆకుల రవి, రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గణేష్ నాయక్, దోమకొండ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కారంగుల అశోక్ రెడ్డి, వైద్య కిషన్ రావు, రాజా గౌడ్, పిల్లి మల్లేష్, జమీల్, సిద్ధికి, యూనుస్, శంకర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుమ ప్రియ, లక్క పత్తిని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# బై ఎలక్షన్స్ కు రెడీ....

హైదరాబాద్, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

సోమవారం సుప్రీంకోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ మీద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత.. ఆసక్తికరమైన చర్చ మొదలైంది. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేల మీద వేటుపడితే తెలంగాణ రాష్ట్రంలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బిజెపి ఎమ్మెల్యే అక్కడి అధికార పార్టీలో చేరారు. అతడి వ్యవహారం ఏకంగా సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. సుప్రీంకోర్టు కీలకమైన తీర్పు ఇచ్చింది. అతడి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఒక రకంగా గులాబీ పార్టీకి అనుకూలంగా మారింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల మీద గులాబీ పార్టీ పదేపదే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కింది . దీంతో సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం కీలకమైన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ప్రకారం వారం రోజుల్లో గా తెలంగాణ స్పీకర్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల వ్యవహారం మీద ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్పీకర్ ఎమ్మెల్యేల మీద వేటు వేస్తే.. ఆ స్థానాలలో ఉప ఎన్నికలు వస్తాయి. ఉప ఎన్నికల్లో కచ్చితంగా ఆ ఎమ్మెల్యేలకు అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఇచ్చుకోవడం మాత్రమే కాదు వారిని గెలిపించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచిన జోరు మీద ఉన్న అధికార పార్టీ.. ఈ స్థానాలలో ఎలాంటి అస్త్రాలను ప్రయోగిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష గులాబీ పార్టీ మొదట్లో జోరు చూపించింది.. ఆ తర్వాత రేవంత్ రెడ్డి ఎంట్రీ ఇవ్వడంతో ఒక్కసారిగా వెనక్కి తగ్గింది. ఆ తర్వాత పరిస్థితి మొత్తం మారిపోయింది. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే రేవంత్ రెడ్డి ఈసారి కూడా గులాబీ పార్టీ గతంలో చేసిన తప్పులను తెరపైకి తీసుకొచ్చే అవకాశం ఉంది. 2014 నుంచి మొదలుపెడితే 2023 వరకు గులాబీ పార్టీ అనేక పర్యాయాలుగా



ఫిరాయింపులను ప్రోత్సహించింది. టిడిపి నుంచి మొదలుపెడితే వామపక్షాల వరకు ఏ పార్టీని కూడా వదిలిపెట్టలేదు. ఒక రకంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షం అనేది ఉండకుండా కేసీఆర్ చూసుకున్నారు. అయితే ఇదే విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రజల్లోకి తీసుకెళ్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పది నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు రావాలని గులాబీ పార్టీ కోరుకుంటుంటే.. అధికార కాంగ్రెస్ కూడా అలానే భావిస్తోంది. ఒకవేళ ఈ స్థానాలలో గనక కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అప్పుడు పరిస్థితి వేరే విధంగా ఉంటుంది. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓడిపోయి గులాబీ పార్టీ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నది. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి కాస్త అడ్వాంటేజ్ ఉంటుంది. అలాంటప్పుడు ఈ ఉప ఎన్నికల్లో అయ్యే ఖర్చు గులాబీ పార్టీ భరిస్తుందా? జూబ్లీహిల్స్ మాదిరిగా పరిస్థితి ఎదురైతే ఏం చేస్తుంది? ఇప్పుడు ఈ ప్రశ్నలకే సమాధానం లభించాల్సి ఉంది.

### రాజీనామా చేయించే యోచనలో సీఎం

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే బీఆర్ఎస్ నేతలు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది అని వ్యాఖ్యలు చేశారు. మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని బెదిరింపులకు దిగారు. దీంతో అలర్ట్ అయిన రేవంత్‌రెడ్డి.. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఫిరాయింపులకు తెరతీశారు. దీంతో దానం నాగేందర్, కడియం శ్రీహరితో మొదలైన ఫిరాయింపులు పది మంది వరకు జరిగింది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తర్వాత సుప్రీం కోర్టు తలుపు తట్టారు. విచారణ జరిపి త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు మూడు నెలల గడువు ఇచ్చింది. కానీ ఇప్పటికీ విచారణ కాకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో సుప్రీం కోర్టు స్పీకర్‌పై అగ్రహం వ్యక్తం చేసింది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు అంశం మళ్లీ వేడెక్కింది. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వారిలో కొంతమందికి మాత్రమే రాజీనామా చేయించి ఉపఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన కాంగ్రెస్‌లో నెలకొంది. కానీ ఈ వ్యూహంలో ప్రమాదం కూడా ఉంది. ఒకరిరెండు మంది ఓడిపోతే రాజకీయంగా నష్టం, అందరూ ఓడితే ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతీయొచ్చు. ఈ భయంలోనే సీఎం జాగ్రత్త పడుతున్నారని తెలుస్తోంది. ఫిరాయించిన వారిలో ఏడునుంచి ఎనిమిది మంది తాము ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని స్పీకర్‌కు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇదే సమయంలో విచారణ ఆధారంగా బీఆర్ఎస్ పిటీషన్‌ను తిరస్కరించే అధికారం స్పీకర్‌కు ఉంది. కానీ, దానం నాగేందర్, కడియం శ్రీహరితో రాజీనామా చేయించక తప్పని పరిస్థితి నెలకొందిబీఆర్ఎస్ అధ్వర్యంలో స్పీకర్‌కు ఫిరాయింపు కేసులు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా దానం నాగేందర్, కడియం శ్రీహరి కేసుల్లో సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిర్దిష్ట కాలమానంలో నిర్ణయం ఇవ్వకపోతే నేరుగా కోర్టే జోక్యం చేసుకునే అవకాశం ఉంది. ఇది స్పీకర్‌పై నేరుగా ఒత్తిడి పెంచుతోంది. మరోవైపు రేవంత్ రెడ్డి తన ప్రభుత్వాన్ని బలోపేతం చేసుకోవాలంటే ఫిరాయింపు అంశాన్ని చట్టపరంగా, రాజకీయంగా సమతుల్యంగా నిర్వహించాలి. ఏదైనా తప్పు నిర్ణయం పార్టీకి నష్టం కాకుండా రాష్ట్రస్థాయిలో ప్రతికూలతను తెచ్చే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయం. ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంశం తెలంగాణ రాజకీయాల్లో కేవలం వ్యక్తుల స్థాయికి పరిమితం కాలేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ నైతికత, పాలన స్థిరత్వంపై పరీక్షగా మారుతోంది. స్పీకర్ తీర్పు ఒకవైపు రేవంత్ రెడ్డి నేతృత్వాన్ని బలోపేతం చేసే అవకాశం ఇస్తే, మరోవైపు చట్టపరమైన ముప్పు కూడా తలెత్తవచ్చు.

# అసమర్థులకు పెద్ద పీట

కరీంనగర్ నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)

క్రికెట్.. ప్రపంచంలో ఎక్కువ ఆదరణ ఉన్న ఆట. ఇక ఇది మన ఆట కాకపోయిన మన దేశంలో క్రికెట్‌కు ఏ క్రీడకు లేనంత క్రేజ్ ఉంది. దీంతో తమ పిల్లలను క్రికెటర్‌ను చేయాలని తల్లిదండ్రులు.. క్రికెటర్ కావాలని పిల్లలు సాధన చేస్తున్నారు. అయితే సెలక్షన్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎలాంటి పరిస్థితులు ఉంటాయో తాజాగా బయటపడింది. టాలెంట్ ఉన్నవారిని పక్కన పెట్టి.. అసమర్థులకు అవకాశాలు కల్పిస్తున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లాలో ఎస్.జీ.ఎఫ్ క్రీడల్లో అవకతవకలపై ఓ క్రీడాకారుడు డీఈవోకు రాసిన లేఖ ఇప్పుడు సంచలనంగా మారింది. సెలక్షన్‌లలో అవకతవకలు జరిగాయని పలువురు యువ క్రీడాకారులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ాఉఈ అండర్ 14 క్రికెట్ సెలక్షన్స్ లో భాగంగా నవంబర్ 13న అండర్?14 జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. అయితే ఈ సెలక్షన్‌లో సంబంధం లేని వ్యక్తులు, క్రికెట్ నిపుణులు కానివారు సెలెక్టర్లుగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి.. ప్రభుత్వ పీఈటీలు పోటీలను పర్యవేక్షించాల్సి ఉండగా, వారు తమ స్నేహితులైన క్రికెట్ అకాడమీల నిర్వాహకులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారని ఆరోపణలున్నాయి.. దీంతో వారు తమ అకాడమీలో క్రికెట్ కోచింగ్ తీసుకుంటున్నవారినే ఎంపిక చేశారని ఓ విద్యార్థి డీఈవోకు లేఖ రాశాడు. తమకన్నా తక్కువ ప్రతిభ కనబర్చిన వారికీ అవకాశం కల్పించారని ఆవేదన వ్యక్తం చేశాడు. మొత్తం 20 మందితో కూడిన ఎస్ఏఎఫ్ స్క్వాడ్‌లో 9 మంది ఒకే అకాడమీకి చెందిన క్రీడాకారులను ఎంపిక చేయడం విద్యార్థి లేఖకు ఉదాహరణ. 'మా అకాడమీకి వస్తేనే ఎంపిక చేస్తాం' అని కొందరు నిర్వాహకులు తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేశారని కూడా ఆరోపణలు వచ్చాయి. అర్హులైన ఆటగాళ్లను పక్కనబెట్టి, స్నేహితులు, బంధువులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల స్థానిక ప్రతిభాజ్యోతులు వెనుకబడిపోయారని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విధమైన ఎంపికలు క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పీఈటీల స్నేహితులు, సంబంధిత అకాడమీల నిర్వాహకులే సెలెక్టర్లుగా వ్యవహరించారని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. కొందరు సెలక్టర్లకు క్రికెట్ అంటే ఏమిటో కూడా తెలియదని పేర్కొంటున్నారు. కఠినంగా శ్రమించి శిక్షణ పొందినా, పరిచయం లేకపోతే అవకాశం ఇవ్వడం లేదని పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ప్రభుత్వ క్రీడాశాఖ అధికారుల విచారణ జరిపి పారదర్శకంగా పని చేయాలనే డిమాండ్ చేస్తున్నారు. పక్షపాత ధోరణి కరీంనగర్‌లో మాత్రమే కాక, ఇటీవలి సంవత్సరాల్లో ఇతర విభాగాల సెలక్షన్‌లలో కూడా ఇలాంటి పక్షపాతం ఆరోపణలు ముందుకు వస్తున్నాయి. రాష్ట్ర స్థాయి ఎంపికల్లో న్యాయబద్ధతను కాపాడటానికి కఠిన నియమాలు, స్వతంత్ర ప్యానెల్ అవసరమని క్రీడా సమాజం అభిప్రాయపడుతోంది.

# సంగారెడ్డిలో ఘనంగా ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలు

## – పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 19:

సంగారెడ్డి పట్టణంలో బుధవారం మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పార్టీ శ్రేణులతో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీకి సంగారెడ్డి మెదక్ జిల్లాలతో ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేశారు. మెదక్ పార్లమెంటు నుండి ఎంపీగా గెలిచి ఇందిరాగాంధీ ప్రధాని అయ్యారన్నారు. నాటి మెదక్ జిల్లా కాంగ్రెస్ అగ్రనేతలు రామచంద్రారెడ్డి, బాగారెడ్డి ల కోరిక మేరకు ఆమె ఇక్కడి నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలని ఉద్యోగ అవకాశాలు పెంపొందించాలని ఉద్దేశంతో సంగారెడ్డి లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ఇందిరా గాంధీ కృషితోనే తీసుకురావడం జరిగిందన్నారు. బీడీఎల్, ఇక్రిసాట్ వంటి సంస్థలను తీసుకువచ్చిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. దేశంలో ఇందిరాగాంధీ హయాంలో చేపట్టిన సంస్కరణలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. గరీబి హటా బో నినాదంతో దేశంలోని పేదరికం పారదోలారని గుర్తు చేశారు.



భూమిలేని పేదలు రైతులకు భూములు పంచారని, రోటీ కపడ ఔర్ మక్కా నినాదంతో పేద ప్రజల స్థితి గతులను మార్చిన గొప్ప వనిత ఇందిరాగాంధీ అని కొనియాడారు. దేశ సేవ కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప కుటుంబం ఇందిరా గాంధీ దేనని వారు అందించిన సేవలు ఎంతో అమూల్యమైనవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంత కిషన్, ఆంజనేయులు, కూన సంతోష్ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం వరకు రోడ్డు మరమ్మతులు లైటింగ్ ఏర్పాటు చేయాలి

## -అఖిలపక్ష పార్టీలు, కుల సంఘాలు డిమాండ్

మణుగూరు నవంబర్ 19 (భారతశక్తి): మణుగూరు నుండి బయ్యారం క్రాస్ రోడ్ వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టి, లైటింగ్ ఏర్పాటు చేసి, ప్రమాదాలను, దుమ్ము, దూళి నివారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని అఖిలపక్ష పార్టీలు, కుల సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) ఆధ్వర్యంలో మణుగూరు లోని స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో అఖిలపక్ష పార్టీలు, సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల, సంఘాల నాయకులు మాట్లాడుతూ మణుగూరు నుండి బయ్యారం క్రాస్ రోడ్ వరకు రోడ్డు గుంతల మయంగా తయారై, లైటింగ్ లేక అనేక ప్రమాదాలు జరిగి, అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసి, గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలు పడ్డ దగ్గర రోడ్డు మరమ్మతులు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, యాష్ కంకర పోసి చేతులు దులుపుకోవడం వలన విపరీతమైన దుమ్ము, దూళీ లేస్తూ ప్రయాణికులు ఈ ప్రాంతం గుండా ప్రయాణించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ రహదారి గుండా నిత్యం వందలాది ఇసుక లారీలు, బొగ్గు టిప్పర్లు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఈ ప్రాంతంలో బి టి పి ఎస్, సింగరేణి, ఇసుక రీచ్లు ఉండి కోట్లాది రూపాయల సి ఎస్ ఆర్ నిధులు, డిఎంఎఫ్ నిధులు వస్తున్నా! ఈ రోడ్డు అభివృద్ధి పట్ల ఈ ప్రాంత అభివృద్ధి పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, ఈ నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారని ప్రభుత్వాన్ని, ప్రభుత్వ



అధికారులను ప్రశ్నించారు. లైటింగ్ కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి స్తంబాలు వేసి, వైర్లు లాగి ఎందుకు వదిలేశారని, లైట్లు ఎందుకు ఏర్పాటు చేయలేదని, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి వేసింది కాంట్రాక్టర్ల కోసమా? ప్రజల కోసమా? అని ప్రశ్నించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని అఖిలపక్ష పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కు, ఎమ్మెల్యేకు, సబ్ కలెక్టర్, కలెక్టర్ లకు వినతి పత్రాలు అందజేసి, వారి దృష్టికి తీసుకెళ్లాలని, అప్పటికీ సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉదృతం చేయాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్. మధుసూదన్ రెడ్డి, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా), దుగ్యాల. సుధాకర్ (సిపిఐ), పున్నం. బిక్షపతి (బిజెపి), వై. పూర్ణచందర్ రావు (టిడిపి), రవి(న్యూడెమోక్రసీ), గుర్రం. శ్రీనివాస్, (బీసీ సంఘం నాయకులు), బోయిళ్ళ. వెంకటేశ్వర్లు (ఎమ్మార్పీఎస్), బత్తుల. వెంకటేశ్వర్లు, జె. సూర్యనారాయణ రావు, తురక. మధు, తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులకు క్రికెట్ పోటీలు : ఎస్సై వెంకటేశ్వరరావు

ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 19 (భారత శక్తి) :



ములుగు జిల్లాలోని పది మండలాల మీడియా మిత్రులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ శబరీష్.వి తెలిపినట్లు ములుగు ఎస్సైవెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని మండలాల వారీగా ఒక టీము ను తయారుచేసి, పది మండలాలకు గాను పది టీములతో కూడిన టోర్నమెంట్ ను జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డు ప్రక్కన ఉన్న తంగేడు మైదానంలో క్రికెట్ మ్యాచ్ ని నిర్వహించనున్నట్లు ఎస్సై తెలిపారు. ములుగు, మల్లంపల్లి రెండు మండలాలకు సంబంధించిన మీడియా ప్రతినిధులు ఎంతమంది ఉన్నారో వారు తమ తమ టీమ్ లను తమకు తెలియజేయాలని, టీముల మధ్య పోటీ నిర్వహించి గెలిచిన జట్టును మండల టీముగా పరిగణించడం జరుగుతుందని అన్నారు. మీడియా మిత్రులు సహకరించి వారి వారి టీమ్ లతో సంప్రదించాలని ఆయన కోరారు.

# ప్రీతికరమైన రోజున అన్నదానం చేయడమంటే జన్మధన్యమే.!

మణుగూరు, నవంబర్ 19 (భారతశక్తి): అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన భూతనాధుడుకి ప్రీతికరమైన రోజు అన్నదానం చేయడమంటే జన్మధన్యమేనని అయ్యప్ప మాల ధరించిన కన్నె స్వామి పీక నాగరాజు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని



శివాలయం పీఠం గురుస్వామి యాకయ్య ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్, గణేష్ బజార్ లో గల తన నివాసంలో నిత్యపూజలో భాగంగా మధ్యాహ్నం ఆరాధన నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి మాలలు ధరించిన దీక్ష పరులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముందుగా అయ్యప్ప స్వామి సోదరులైన గణపతి, సుబ్రమణ్యస్వామి ఇమిడి ఉన్న చిత్రాలకు ప్రాణ ప్రతిష్టి చేశారు. గౌరమ్మను చేసి పూజ చేశారు. అయ్యప్ప సోదరులైన అగ్రజా గణాధిపతి గణపయ్యకు, సుబ్రహ్మణ్యం స్వామికి అష్టోత్తర నామాలతో పూజలు, అదిశంకర చార్యుల పంచారత్నాలు చదివి మంగళహారుతులు ఇచ్చి మాలలు దరించిన స్వాములకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా గురుస్వామి యాకయ్య మాట్లాడుతూ ఎంతో కఠినంగా నియమ నిష్ఠలతో మండలదీక్షకు పూనుకొన్న మాలలు దరించిన స్వాములకు ఏయే ధర్మాలని పాటించాలో, ఏ నియమనిష్ఠలతో వుండాలో కొన్ని మార్గదర్శక సూత్రాలను గురుస్వామి కొత్తగా మాలధరించిన కన్నె స్వాములకు సూచించారు. అందరినీ భగవంతుని స్వరూపాలుగా భావించాలని తెలిపారు. అయ్యప్ప శరణు ఘోషను నిత్యం కంఠస్తాం చేస్తూ, నిత్యం భజన కార్యక్రమంలో పాల్గొనాలని యాకయ్య గురుస్వామి సూచనలు చేశారు. భూతనాధుడైన అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తే మనస్సుకు వచ్చే ప్రశాంతత అభివర్ణించలేమని కన్నె స్వామి నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఎన్ నాగేశ్వరరావు, బోడ బాలు, మోర్ శ్రీను, సదానందం, కన్నె, కత్తి, గంట, గద, పెరు స్వాములు, మాల ధరించని స్వాములు పాల్గొన్నారు.

# వయో వృద్ధులు సమాజానికి జ్ఞాన బండాగారాలు: జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

## కలెక్టరేట్లో ఘనంగా వయోవృద్ధుల వారోత్సవాలు.

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 19 :

వయోవృద్ధులు సమాజానికి జ్ఞాన బండాగారాలు అని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా మహిళా శిశు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు 2025 ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన తో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ... వయోవృద్ధులు మన సమాజానికి అపారమైన జ్ఞాన భాండాగారం. వారి అనుభవాలు, మార్గదర్శకాలు భవిష్యత్ తరాల నిర్మాణానికి దిక్సూచి లాంటివి అని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన చట్టాల పై సమగ్ర అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులను ఆమె సూచించారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన వయోవృద్ధుల సంక్షేమ చట్టం 2007 జిల్లాలో పటిష్టంగా అమలు అవుతుందన్నారు ఈ చట్టం అమలు కోసం జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ చట్టం ద్వారా పరిష్కరించిన వివిధ కేసుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. వివిధ రంగాలలో పనిచేసిన వయోవృద్ధులు వారి అనుభవాలను భావితరాలకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలోనారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వయోవృద్ధుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# డూప్లి 'కేటుగాళ్లు'భూ మాఫియా రాకెట్

## దర్యాప్తులో బయటపడిన ఆధారాలు పట్టణ సీఐ గోపీనాథ్




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 19 (భారత శక్తి): మీ కళ్లెదుటే మీ ఆస్తి ఉన్నా.. మీకు తెలియకుండానే వేరొకరి చేతుల్లోకి చేరిపోవచ్చు. మరొకరి పేరున మారిపోవచ్చు! ఫేక్ డాక్యుమెంట్లు.. కొందరు భూ మోసాలకు పాల్పడుతున్నారు. అధికారుల సహకారంతో భైంసా లో ఈ తరహా దందా ముమ్మరంగా సాగుతున్నది. భూ యజమానులు అప్రమత్తం అయిన చోట దొంగ రిజిస్ట్రేషన్ల బాగోతం బట్ట బయలు అవుతుండగా.. కొందరు అధికారులు గుడ్డిగా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు.

భైంసాలో భూ మోసం గుట్టు రట్టు మున్సిపాలిటీ%-%సబ్ రిజిస్ట్రేషన్ శాఖల్లో భారీ అవినీతి బట్టబయలు పట్టణ సీఐ గోపీనాథ్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి భైంసా పట్టణంలోని బ్రాహ్మణ గల్లీలోని హౌస్ నెం. 2-2-161 యాజమాన్యాన్ని నకిలీ పత్రాలతో అక్రమంగా మార్చేసిన భూ మోసం కేసులో సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. అసలు యజమాని ఫిర్యాదు మేరకు భైంసా టౌన్ పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. పోలీసుల విచారణలో మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్ శాఖ, మధ్యవర్తులు కలిసి నడిపిన భారీ మోసం బయటపడింది.

నకిలీ యజమాని సృష్టించి మోసం

చట్లావార్ శైలేష్, గోగుర్ రాజు, రఫీయుద్దీన్, ఇంతియాజ్ కలిసి ఇంటిని అక్రమంగా హస్తగతం చేసుకునేందుకు కుట్ర పన్నారు. అసలు యజమాని పేరుతో సరితూగే వ్యక్తిని నకిలీ యజమానిగా తయారు చేసి, డాక్యుమెంట్ రైటర్ రఫీ నకిలీ నోటరీ అఫిడవిట్ సిద్ధం చేశాడు.

భైంసా మున్సిపాలిటీలో అవినీతి ఆట

మున్సిపాలిటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్‌కాంట్రాక్ట్ ముగిసినా పని కొనసాగిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ మనీష్‌తో కలిసి మ్యుటేషన్‌ను జారీ చేసే వ్యవస్థను పూర్తిగా వక్రీకరించారు.

మనీష్ అధికారిక కమిషనర్ డాంగిల్‌ను వాడుతూ, ప్రతి మ్యుటేషన్‌కు లంచాలు సేకరించాడు. వాటిని 60% ఇంతియాజ్, 20% కమిషనర్, 20% ఇతరులకు పంచినట్లు %ఔష్ఘ్రూజూజూజూ% చాట్‌ల ద్వారా బయటపడింది. కేవలం %ఖ్యూ% ఆధారంగా ఆగస్టు 2న ఎలాంటి గ్రౌండ్ ఎంక్వైరీ లేకుండా 2%-%3 గంటల్లో మ్యుటేషన్ పూర్తి చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

కమిషనర్ సంతకం లేకుండానే సర్టిఫికేట్ జారీ

ఆగస్టు 5న కమిషనర్ సంతకం లేని యాజమాన్య ధృవీకరణ పత్రాన్ని మున్సిపాలిటీ జారీ చేసింది. అదే రోజు నకిలీ సేల్ అగ్రిమెంట్ అమలు చేయబడింది.

SROలో 25,000 లంచంతో ఒప్పందం 'మేనేజ్'::

కమిషనర్ సంతకం లేని సర్టిఫికెట్‌ని SRO ఎలా ఆమోదిస్తారని నిందితుడు ప్రశ్నించగా, రఫీయుద్దీన్%ూ=ా% కార్యాలయంలో పని 'జాగ్రత్తగా మేనేజ్ చేసేందుకు' తన వ్యక్తి షేక్ జానీ ద్వారా 25,000 చెల్లించామని అంగీకరించాడు.

ఈ నకిలీ ఒప్పందాన్ని ఆధారంగా చేసుకొని రోహిత్ అనే వ్యక్తి వద్ద నుంచి 10 లక్షలు అప్పుగా తీసుకున్నారు.

:: మోసం బట్టబయలయ్యాక రద్దు దస్తావేజు ::

అసలు యజమాని అక్టోబర్ 29న ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు మొదలైంది. పన్నాగం బట్టబయలవుతుందని గ్రహించిన నిందితులు రద్దు పత్రం కోసం తొందరపడ్డారు. నవంబర్ 10న రద్దు పత్రం నమోదు చేశారు.

:: నోట్ ఫైల్‌ను వెనుక తేదీలతో క్రియేట్ చేసేందుకు ప్రయత్నం ::

మున్సిపాలిటీపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఆగస్టు 2న జరిగిన అక్రమ మ్యుటేషన్‌ను కప్పిపుచ్చేందుకు నవంబర్ 14న బ్యాక్‌డేటెడ్ నోట్ ఫైల్ సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు. భైంసా పట్టణ సీఐ గోపీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఇది వ్యవస్థీకృత భూ మాఫియా రాకెట్దర్యాప్తులో బయటపడిన ఆధారాలు:వాట్సాప్ చాట్‌లు,

నకిలీ డాక్యుమెంట్లు కాల్ లాగ్‌లు,

లావాదేవీల రికార్డులు,సాక్షుల వాంగ్మూలాలు

పోలీసుల ప్రకారం ఇది ప్రైవేట్ వ్యక్తులు మున్సిపల్ సిబ్బంది రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కలిసి నడిపిన సిండికేట్ మోసం.

# శాయంపేట ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్19: గతపాలనలో అభివృద్ధికి నోచుకోలేదు.గడిచిన రెండేళల్లో అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి



చేస్తున్నాం.గతపాలకుల పాలనలో అభివృద్ధికి నోచికోని 31 డివిజన్ శాయంపేటను గడిచిన రెండేళల్లో అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.బుధవారం నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి న్యూ శాయంపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.60 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణనికి భూమి పూజా చేశారు.అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబధిత అధికారులని ఆదేశించారు.పూర్తి గ్రామీణ వాతావరణంలో ఉన్న డివిజన్ ని గతంలో ఎవరు పట్టించుకోలేదని గడిచిన రెండేళ్లలో అత్యధికంగా నిధులు కేటాయించామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు,మాజీ కార్పొరేటర్ లు మోహన్ రావు ,శివ శంకర్,డివిజన్ అధ్యక్షులు సురేందర్,సీనియర్ నాయకులు,కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

భారత శక్తి


# హిందుత్వమే నా శ్వాస

## 12 శాతం ముస్లింలంతా ఒక్కటైతే తప్పు లేదు

### 80 శాతం హిందువులంతా ఒక్కటైతే తప్పా
### కాంగ్రెస్ 2ఏళ్ల వైఫల్యాలపై కాషాయ సమరభేరికి శ్రీకారం
### కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్, నవంబర్ 19(భారతశక్తి ప్రతినిధి)ం

ఎవరేమనుకున్నా హిందుత్వం మాట్లాడుతూనే ఉంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుండ బద్దలు కొట్టారు. నా నోటి నుండి హిందుత్వం ఆగిపోయిందంటే అదేరోజు నా శ్వాస ఆగిపోయినట్లేనని స్పష్టం చేశారు. హిందుత్వ నినాదాన్ని గడప గడపకూ తీసుకెళ్లి తెలంగాణలో రామరాజ్యాన్ని తీసుకొచ్చి తీరుతామని స్పష్టం చేశారు. "పహల్గాంలో అవయవాలు చూసి హిందువులను కాల్చి చంపారు. హైదరాబాద్ లో ముత్యాలమ్మ, పెద్దమ్మ ఆలయాలను కూల్చివేశారు. గోరక్షకులపై ముస్లింలు కాల్పులు జరిపారు. నిజామాబాద్ లో ముస్లిం వ్యక్తి కానిస్టేబుల్ ను చంపారు. డీసీపీ చైతన్యపై దాడి చేసింది ముస్లిం. మరి అట్లాంటప్పుడు హిందుత్వం మాట్లాడకుండా ఎందుకు ఉండాలి? తెలంగాణలో గత ఎన్నికల ముందు వరకు అధికారంలోకి దాదాపు వచ్చేసినంత వాతావరణ ఏర్పడిందంటే దానికి కారణం హిందుత్వవే. జీహెచ్ఎంసీలో 4 కార్పొరేటర్లుంటే... 48 స్థానాలను గెలిచామంటే దానికి కారణమూ హిందుత్వమే. కరీంనగర్ లో నేను ఎంపీగా గెలిచానంటే హిందుత్వమే కారణమని గల్లా ఎగరేసుకుని చెబుతా"అని తెలిపారు. నరేంద్రమోదీ ప్రభుత్వం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా అందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ ఎన్నికలొస్తే మసీదుల్లో ఇమామ్, మౌలానాలంతా ముస్లింలందరితో ప్రతిజ తీసుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేయిస్తున్నారో ఆత్మ విమర్శ చేసుకోవాలని కోరారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్ లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ అధ్యక్షులు, జిల్లా నాయకుల సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు పార్టీ రాష్ట్ర సంఘటనా మంత్రి చంద్రశేఖర తివారీ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కరీంనగర్ ఇంఛార్జీ గంగిడి మనోహర్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వైఫల్యాలపై రూపొందించిన 'కరపత్రం'తోపాటు సంతకాల సేకరణ పత్రాలను విడుదల చేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనా, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలపై ఈనెల 26న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన ఉద్వేగ భరితంగా ఆరోపణలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి చిత్తశుద్ధి లేనేలేదు. కేవలం కేంద్ర నిధుల కోసమే ఎన్నికలు నిర్వహించాలనుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండేళ్లలో ఏ ఒక్క గ్రామ పంచాయతీకైనా నయాపైసా ఇచ్చిందా? ఇవ్వలేదు. అట్లాగే రేపు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లేస్తే పైసలు ఎక్కడి నుండి తీసుకొస్తారు? ఎమ్మెల్యేకు కూడా సొంతంగా నిధులు లేనేలేవు. పొరపాటున కాంగ్రెస్ కు ఓటేస్తే పంచాయతీలకు ఒక్క పైసా కూడా రాదు. మరి పంచాయతీల నిధులు తెచ్చేది కేంద్రమే. 15వ సంఘం నిధులు, ఎంపీ లాడ్స్, జాతీయ ఉపాధి హామీ, సడక్ యోజన సహా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ కేంద్రమే నిధులిస్తోంది. అట్లాంటప్పుడు కాంగ్రెస్ కు ఓటేసి ఏం లాభం? బీజేపీని గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనే వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతున్నా.

విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నం. కేంద్ర నిధులతోనే ఆయా రంగాల అభివృద్ధి జరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్ హెచ్ఎం నిధులిస్తున్నాం. ఇవి సరిపోకపోతే సీఎస్సార్ నిధులతో అవసరమైన మెడికల్ పరికరాలను కొనుగోలు చేసి అందిస్తున్నాం. హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.5 కోట్ల సీఎస్సార్ నిధులతో మెడికల్ పరికరాలను అందజేసినం. హుజూరాబాద్ లో స్టేడియం కోసం రూ.10 కోట్లు విడుదల చేయబోతున్నాం. తెలంగాణకు సీఐఆర్ఎఫ్ కింద రూ.1200 కోట్లు తీసుకొస్తే... అందులో రూ.500 కోట్లను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి తీసుకొచ్చి ఖర్చు చేస్తున్నం. గన్నేరువరం చిరకాల వాంఛ గన్నేరువరం బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.70 కోట్లు విడుదల చేయించినం. మరి కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద నయాపైసా లేదు. మరి ఆ పార్టీకి ఓట్లేస్తే పంచాయతీలకు ఒరిగేదేముంది? గతంలో బీఆర్ఎస్ కు ఓటేసిన పాపానికి సర్పంచులు ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చింది. బీజేపీకి ఓట్లేసి గెలిపిస్తే పంచాయతీలకు నిధులు తీసుకొచ్చే బాధ్యత నేను తీసుకుంటా. అవసరమైతే సీఎస్సార్ నిధులు తీసుకొచ్చి పంచాయతీలకు ఖర్చు చేస్తా. ఈ విషయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతున్నా. కాంగ్రెస్ రెండేళ్ల పాలనా వైఫల్యాలు, బీఆర్ఎస్ 10 ఏళ్ల వైఫల్యాలను వివరిస్తూ కరపత్రం రూపొందించాం. ఇంటింటికీ పంపాలి. అట్లాగే కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ఈనెల 26 నుండి 'సంతకాల సేకరణ' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఈనెల 26న ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీ మీ పోలింగ్ బూత్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి కరపత్రం అందించి 'సంతకాల సేకరణ' చేయాలని కోరుతున్నా. ప్రజలందరి సంతకాలతో కూడిన పత్రాలను ప్రత్యేక రథం తయారు చేయించి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు అందజేస్తాం. ఆ తరువాత కూడా కాంగ్రెస్ మెడలు వంచి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ఆందోళనలను ఉద్యమం చేస్తాం. కాంగ్రెస్ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ ఫెస్టివల్' నిర్వహించాలని నిర్ణయించడం సిగ్గు చేటు. ఏం సాధించారని తెలంగాణ రైజింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మీరు జరుపుకోవాల్సింది "తెలంగాణ రైజింగ్ ఫెస్టివల్" కానే కాదు.... "తెలంగాణ డౌన్ ఫాల్ ఫెస్టివల్ (తెలంగాణ పతన వేడుకలు) నిర్వహించుకుంటే బాగుండేది. లేకపోతే కాంగ్రెస్ సింకింగ్ ఫెస్టివల్ (కాంగ్రెస్ దిగజారుడు ఉత్సవాలు) నిర్వహిస్తామంటే బాగుండేది. మార్పు తెస్తామంటూ కాంగ్రెస్ పార్టీ "అభయ హస్తం" పేరుతో గత అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలతో 42 పేజీల మేనిఫెస్టోను విడుదల చేశారు కదా? ఎన్ని అమలు చేశారో చెప్పండి. 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేస్తామని ఊదరగొట్టారు కదా? మహిళలకు ప్రతినెలా 2,500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? ఏటా రైతులకు, కౌలు రైతులకు 15 వేలు, వ్యవసాయ కూలీలకు 12 వేలు ఇచ్చారా? నిరుద్యోగులకు ప్రతి నెలా 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు కదా ఏమైంది? ఏడాదిలో లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు ఎందుకు చేయలేదు? పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తానన్నారు కదా? వృద్దులకు ప్రతినెలా 4 వేల పెన్షన్, విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు....చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో ఊరూవాడా ఢంకా బజాయించి చెప్పారు ఏమైంది? రైతుల కోసం వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తామన్నారు. హైదరాబాద్ లో మీటింగ్ పెట్టి 'యూత్ డిక్లరేషన్' ప్రకటించారు. చేవెళ్లలో మీటింగ్ పెట్టి 'ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్' ను అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. కామారెడ్డిలో మీటింగ్ పెట్టి బీసీలకు 6 నెలల్లోపే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని "కామారెడ్డి డిక్లరేషన్"అని ప్రకటించారు. మరి వీటిలో ఏ ఒక్క డిక్లరేషన్ అయినా అమలు చేశారా? జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచారని కాంగ్రెస్ సంబురపడుతున్నారు. ముస్లింల ఓట్లతో డబ్బులను నీళ్లలా ఖర్చు చేసి గెలిచారే తప్ప తెలంగాణలో కాంగ్రెస్ పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉంది. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణపాఠం తప్పదు. బీజేపీ కార్యకర్తలంతా కచ్చితంగా ఏదో ఒక ఎన్నికల్లో గెలిచి ప్రజాప్రతినిధులుగా గెలవాలని కోరుతున్నా. అప్పుడే ప్రజల కష్ట నష్టాలు అర్థమవుతాయి. కచ్చితంగా పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలని కోరుతున్నా. గ్రామాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం కేంద్రంలోని నరేంద్రమోదీదే. రైతులకు రెట్టింపు గిట్టుబాటు ధరను అందిస్తామని మాట ఇచ్చి నిలుపుకున్నం. క్రమం తప్పకుండా కిసాన్ సమ్మాన్ నిధులను అందిస్తున్న ఘనత మాదే. ఇగ బీఆర్ఎస్ పాలనలో ప్రజలు నరకయాతన చూశారు. పంచాయతీలకు తీవ్రమైన నష్టం జరిగింది. సర్పంచులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆత్మహత్య చేసుకునే స్థాయికి చేరారు. సర్పంచులు అప్పులపాలు కావడానికి కారకులు బీఆర్ఎస్సే. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలే. రూ.6 లక్షల కోట్ల అప్పు చేసి కూడా ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వకుండా రాష్ట్రాన్ని దోచుకున్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించాలని కోరుతున్నా.


హిందుత్వం మాట్లాడాలా? వద్దా?... బరాబర్ మాట్లాడతా. బండి సంజయ్ నోటి నుండి హిందుత్వం ఆగిపోయిన నాడు నా శ్వాస ఆగిపోయినట్లే. బరాబర్ మాట్లాడి తీరుతా. బీజేపీ మూల సిద్ధాంతమే హిందుత్వం. ఆ హిందుత్వంతోనే వరుసగా 3 సార్లు కేంద్రంలోకి అధికారంలోకి వచ్చాం. పహల్గాంలో అవయవాలు చూసి హిందువులను కాల్చి చంపారు. హైదరాబాద్ ముత్యాలమ్మ, పెద్దమ్మ ఆలయాలను కూల్చివేశారు. గోరక్షకులపై ముస్లింలు కాల్పులు జరిపారు. నిజామాబాద్ లో ముస్లిం వ్యక్తి కానిస్టేబుల్ ను చంపారు. డీసీపీ చైతన్యపై దాడి చేసింది ముస్లిం. మరి అట్లాంటప్పుడు హిందుత్వం మాట్లాడాలా? వద్దా? తెలంగాణలో గత ఎన్నికల ముందు వరకు అధికారంలోకి దాదాపు వచ్చేసినంత వాతావరణ ఏర్పడింది. ఎట్లా ఏర్పడిందో తెలుసా? హిందుత్వంవల్లే. నేను హిందుత్వం కోసం, ప్రజల కోసం పోరాటం చేయాలనే అమిత్ షా చెప్పి నాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించారు. హిందువులను ఓటు బ్యాంకుగా మార్చాం కాబట్టే జీహెచ్ఎంసీలో 4 కార్పొరేటర్లుంటే... 48 స్థానాలను గెలిపించగలిగాం. హిందుగాళ్లు బొందుగాళ్లు అంటూ కేసీఆర్ హేళన చేస్తే హిందువులంతా ఒక్కటై బీఆర్ఎస్ ను ఓడించి హిందువుల సత్తా చూపారు. గల్లా ఎగరేసి చెబుతున్నా..కరీంనగర్ లో హిందూ ఓటు బ్యాంకు ద్వారానే నేను ఎంపీగా గెలిచిన. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడులో వేలాది మంది హిందుత్వం కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేసి రామరాజ్యం కోసం కష్టపడి పనిచేశారు. ముస్లింలను పొగుడుతున్న పార్టీల నోట కూడా "జై శ్రీరాం' అనే మాట రావాలనే కసితో పనిచేస్తున్నా. నేనడుగుతున్నా....ముస్లింలకు మోదీ ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు అందిస్తోంది కదా? ఉచితంగా బియ్యం హిందువులకే కాదు ముస్లింలకు ఇస్తున్నారు. జాతీయ రహదారులు, కిసాన్ సమ్మాన్ నిధులుసహా సంక్షేమ పథకాలన్నీ హిందు, ముస్లిం, క్రైస్తవులు అనే తేడాలేకుండా అందరికీ ఇస్తున్నారు కదా? మరి ఆ ముస్లింలు బీజేపీకి ఎందుకు ఓట్లు వేయడం లేదు?. ఎన్నికలు జరిగితే ఇమామ్ లు, మౌలానాలు మసీదుల్లో మీటింగ్ పెట్టి ముస్లింలంతా ఒక్కటై బీజేపీకి వ్యతిరేకంగా ఓటేయాలని ప్రతిజ తీసుకుని ఎందుకు ఓట్లేస్తున్నరు. ఒక్కసారి గుండెమీద చేయి వేసుకుని ఆత్మ విమర్శ చేసుకోవాలి. 12 శాతం ముస్లింలు ఒక్కటై బీజేపీకి వ్యతిరేకంగా కరెక్టా? 80 శాతం మంది హిందువులను ఏకం చేసి ఓటు బ్యాంకు మారుస్తానంటే తప్పా? కాషాయ జెండా కన్పిస్తేనే అరెస్ట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు... 15 నిమిషాల టైమిస్తే హిందువులను కాల్చి చంపుతామని బెదిరించిన ఒవైసీని అరెస్ట్ చేయకుండా ఆయనతో కలిసి అంటకాగుతుంటే ఏమనాలి? ఎక్కడైనా మసీదులు కూల్చామా? లేదే... కానీ దేవాలయాలను ఎందుకు కూలుస్తున్నారు? గో హత్యలు ఎందుకు జరుగుతున్నాయి? ముస్లిం మహిళలు మా ఆడబిడ్డలుగా భావించి కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం వ్యతిరేకించినా ట్రిపుల్ తలాక్ తీసుకొచ్చిన ఘనత మోదీదే. ముస్లిం మహిళలు సంతోషంగా ఉండటం ఆ పార్టీలకు ఇష్టం లేదు. అయినా ఆ పార్టీలు సెక్యులర్ పార్టీలట. మేం మాట్లాడితే మతతత్వ వాది అంటారా? అట్లయితే మేం బరాబర్ మతతత్వవాదినే. ఇదే హిందుత్వ వాదంతో గడపగడపకూ తిరుగుతా. తెలంగాణలో రామరాజ్యాన్ని తీసుకొచ్చి తీరుతాం.

# క్రీడల్లో ప్రతిభచాటిన గీతం విద్యార్థులు

**– వివిధ క్రీడలలో బంగారు, రజత పతకాలు కైవసం**
**– అభినందించిన గీతం ఉన్నతాధికారులు**

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 19:

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని విద్యార్థులు వివిధ క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ సంస్థకు కీర్తిని తెచ్చి పెడుతున్నారు. ఆయా ఈవెంట్లలో పతకాలను గెలుచుకుని ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.చెన్నైలోని జేఎన్ఎల్ఎస్ లో జరిగిన 'ది చీఫ్ మినిస్టర్స్ ట్రోఫీ గేమ్స్' రాష్ట్ర స్థాయి పోటీలలో సీఎస్ఈ తొలి ఏడాది విద్యార్థి మందలపు శ్రీశాంత్ స్ట్రీట్ ఫైటర్ 6లో రజత పతకాన్ని సాధించారు.మరో అద్భుతమైన విజయంలో, బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి రుషికేశ్ మార్కా, హైదరాబాదులోని హైటెక్ సిటీలో నిర్వహించిన వీవైబీ యాక్టివ్ సీనియర్ టోర్నమెంట్ 2025-26లో (బ్యాడ్మింటన్) పురుషుల సింగిల్స్ లో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. అదే టోర్నమెంటులో పురుషుల డబుల్స్ లో బీబీఏ (ఎఫ్ఎం) తొలి ఏడాది విద్యార్థి ఆయుష్ తో కలిసి రజత పతకాన్ని కూడా సాధించారు.వీటిని అదనంగా, ఇటీవలే బీ.ఆర్క్. మొదటి సంవత్సరం విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల, భారతీయ పికిల్ బాల్




జాతీయ పోటీలలో 18 ఏళ్ల బాలికల రాష్ట్ర జట్టు ఈవెంటులో బంగారు పతకాన్ని గెలుపొందిన విషయం విదితమే.గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, డైరెక్టర్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ డీన్-కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వి.ఆర్. శాస్త్రి, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, క్రీడల విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నారాయణరావు చౌదరి విజేతలను అభినందించడంతో పాటు వారి నిబద్ధత, కృషి, క్రీడా నైపుణ్యాన్ని ప్రశంసించారు.ఈ విజయాలు విభిన్న అథ్లెటిక్ విభాగాలలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించడానికి, యువ ప్రతిభను పెంపొందించడానికి గీతం అంకితభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

# పకడ్బందీగా వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అమలు: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, నవంబర్19(భారతశక్తి ప్రతినిధి):



తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, వయోవృద్ధులకు న్యాయం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు.( అక్టోబర్ 1న ఎన్నికల షెడ్యూల్ కారణంగా ప్రస్తుతం నిర్వహించారు)ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వృద్ధుల సామాజిక భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం ద్వారా వయోవృద్ధుల నుండి వచ్చిన ఫిర్యాదులను వెను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది వయోవృద్ధుల సమస్యలకు సంబంధించి 200 కు పైగా ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. వారి సామాజిక భద్రతకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేసిన పలువురిని జిల్లా కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజయ్య, అడ్వకేట్ ఎర్రం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివాలయం హుండీ లెక్కింపు



మణుగూరు, నవంబర్ 19 (భారతశక్తి): మున్సిపాలిటీ పరిధిలోని దేవాదాయశాఖ శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి దేవస్థానం నందు బుధవారం ఉదయం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. కార్తీక మాసం సందర్భంగా స్వామివారికి భక్తులు కానుకల రూపంలో చెల్లించుకున్న కానుకలను లెక్కించగా నోట్ల రూపంలో రూ 1,34,930, కాయిన్స్ రూపంలో రూ 21,392, మొత్తం రూ 1,56,322/బిలు ఆదాయం సమకూరింది ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎన్ శేషయ్య దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి .బెల్ సింగ్, దేవస్థానం చైర్మన్ కూచిపూడి వెంకటేశ్వరరావు కమిటీ సభ్యులు భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాజీపేటలో ఆల్ఫా ఒమేగా మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగే ఆశీర్వాద పండుగలను విజయవంతం చేయండి: రివరెండ్. నిఖిల్ జాన్ వెల్లడి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్19: గ్రేటర్ వరంగల్ కాజీపేట పట్టణంలోని రైల్వే



స్టేడియంలో ఆల్ఫా ఒమేగా మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిషప్ జాన్ మార్కండేయ దైవ సేవకునిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈనెల 21, శుక్ర 22 శని 23 ఆదివారాల్లో జరిగే క్రైస్తవ ఆశీర్వాద పండుగలను క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పాస్టర్ రెవరెండ్ నిఖిల్ జాన్ డాక్టర్ దీవెన కుమారి బుధవారం మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బైబిల్ మిషన్ అధ్యక్షుడు రివరెండ్ సజీవరావు , బ్రదర్ అనిల్ కుమార్ , గుంటూరు నుండి బ్రదర్. మాథ్యూస్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సువార్త గాయకులు బ్రదర్ నిస్సి జాన్ టి సి ఎఫ్ సహకారంతో ఆశీర్వాద పండుగలను నిర్వహిస్తున్నామని, కుల, మత బేధము లేకుండా అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఆశీర్వాద పండుగలను విజయవంతం చేయాలని రివరెండ్. నిఖిల్ జాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బొక్క రమేష్. ఐలేష్. ధర్ల రాజు,అభిషేక్. మనోజ్,అద్విక్,అక్షయ్. సందీప్,తదితరులు పాల్గొన్నారు.

# 'ఆంగ్లేయులను వణికించిన తెలుగువాడి పాట ...మా కొద్దీ తెల్ల దొరతనం..."

## "గరిమెళ్ళ నిను మరవదు తెలుగు నేల"

స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులలో స్వాతంత్ర్య సమర యోధులపై బ్రిటిష్ పాలకులు దారుణాలు కొనసాగిస్తున్న వేళలో ఒక సాధారణ 'తెలుగు కవి" తెల్లదొరల అరాచకాలను తెగనాడుతూ గొంతెత్తి పాటపాడుచుంటే ఆంగ్లేయుల వెన్నులో వనుకువచ్చిందంటే ఆ పాట కున్న శక్తి ఎంతటిదో మనకు అర్థం అవుతుంది.

గరిమెళ్ళ కలం నుండి మరియు గళం నుండి వచ్చిన ఆ గేయమే 'మా కొద్దీ తెల్ల దొరతనం..".

మాకొద్దీ తెల్లదొరతనము.. దేవా

మా కొద్దీ తెల్లదొరతనము.."

పన్నెండు దేశాలు పండుచున్నగాని పట్టెడన్నము లోపమండి...

ఉప్పు ముట్టుకుంటే దోషమండి

నోట మట్టి కొట్టి పోతాడండి.

అయ్యో! కుక్కలతో పోరాడి కూడు తింటామండి..."

అనే గేయం ఆనాటి జనాలకు ఉత్తేజాన్ని కలిగించింది. అలాగే "దండాలు దండాలు భారత మాత' అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఉరికే తెగువను కలగజేసింది. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రథముడుగా గరిమెళ్ళ గారున్నారు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు ప్రతి తెలుగు వాడి నోటా మార్మోగి ఉద్యమానికి ఊపిరిపోసింది.

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుక గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించాడు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం. గరిమెళ్ళ ప్రాథమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో కొనసాగి, కన్నేపల్లి లక్ష్మీనరసింహం ఆర్థిక సాయంతో విజయనగరం, మచిలీపట్నం, రాజమహేంద్రవరం మొదలైనచోట్ల పైచదువులు చదివాడు. కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పనిచేసి ఆ తరువాత విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. అతని భావాలు,ఆలోచనలు స్వేచ్ఛగా ఉండాలనే తపన వల్ల ఎక్కువకాలం ఏ ఉద్యోగమూ చెయ్యలేకపోయాడు.

1920 డిసెంబర్?లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహాయనిరాకరణ తీర్మానం అమోదించబడిన తర్వాత మహాత్ముడి బాటలో అహింసా పోరాట పద్ధతికి గరిమెళ్ళ జై కొట్టాడు. తెల్లవాడు రకరకాల భేదాలు సృష్టించి దేశ ప్రజల్ని చీల్చి పబ్బం గడుపుకుంటున్నాడని, భారతీయుల అనైక్యతే ఆంగ్లేయుల బలమని భావించాడు. మనమధ్య ఐక్యత లేకపోవడం వల్లనే ఇలాంటి దుస్థితి వచ్చిందని చాలాసార్లు తెలియచేసారు. ఇప్పటికైనా ఐక్యత రావాలని, మనపరిస్తితి అందరికీ తెలియాలని ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ 'మా కొద్దీ తెల్లదొరతనం..' పాటను వ్రాశాడు.

ఆనాటి రోజుల్లో రాజమండ్రిలో ఈ పాట కొత్త ఒరవడిని సృష్టించింది. ఆనోటా-ఈనోటా ఈ పాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చెవినపడి ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నారట. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా. తన కంచు కంఠంతో ఖంగున పాటలు కూడా పాడగలడు. గరెమెళ్ళ పాట విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష



నాకు రాకపోయినప్పటికీ, ఈ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజల్ని సైతం ఎలా చైతన్యవర్చగలదో నేనూహించగలనని అని,ఆ పాటను వ్రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. శిక్ష పూర్తయిన పిదప జైలు నుంచి విడుదల అయిన గరిమెళ్ళ మళ్ళీ ప్రజల మధ్య గొంతెత్తి పాడుతూ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకొని వెళ్ళడానికి కృషిచేశాడు. ఇది చూసి ప్రభుత్వాధికారులు ఆయన బయట ఉండటం ప్రభుత్వానికి మంచిది కాదని భావించి తిరిగి అరెస్టు చేసి కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా మేజిస్ట్రేట్ రెండు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష విధించాడు.

గరిమెళ్ళ జైలులో వుండగా 1923 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు. క్షమాపణ చెబితే జైలునుంచి బయటకు పంపిస్తామని చెబితే క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్న గొప్ప దేశభక్తుడు గరిమెళ్ళ. జైలు నుంచి విడుదల కాగానే ప్రజలు ఆయనకు ఎన్నోచోట్ల సన్మానాలు చేసిన సందర్భం మాత్రమే ఆయన జీవితంలో మధుర ఘట్టంగా మిగిలిపోయింది. ఆ తరువాత కొద్దిరోజులకు భార్య చనిపోవడం అప్పటికే ఇద్దరు కుమార్తెలు ఉండడం వల్ల గరిమెళ్ళ మళ్ళీ పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. ఉద్యమం వైపు సమయం ఇవ్వడం వల్ల అప్పులు పెరగడంతో వున్న ఆస్తి అమ్మేసి అప్పులు తీర్చవలసి వచ్చింది.

శ్రీ శారదా గ్రంథమాల స్థాపించి పద్దెనిమిది పుస్తకాలు అచ్చువేయించి ఆర్థికంగా బలపడలనే ప్రయత్నం అవి అమ్ముడుపోక మరింత అప్పుల్లో కూరుక పోయాడు. ఆయన ఎక్కువగా రాజమండ్రి, విజయవాడ, మద్రాసులకు తిరుగుతూ వుండడంతో, వాటిని పట్టించుకోక పోవడం వల్ల ఆ పుస్తకాలు చెదలుకు ఆహారంగా మారి మరికొంత కొంత నష్టం భరించవలసి వచ్చింది.

1921లో 'స్వరాజ్య గీతములు' పుస్తకం, 1923లో హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, బాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలాసార్లు జైలు శిక్ష అనుభవించడం వల్ల జైలులో వుండగా తమిళ, కన్నడ భాషలు నేర్చుకొని తమిళం నుండి "తిరుక్కురల్", "నందియార్", కన్నడ నుండి "తల్లికోట" గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. కొన్ని ఖండకావ్యాలు రచించిన ఆయన 'మాణిక్యం' అనే నాటకాన్నీ వెలువరించాడు. ఆంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశాడు. ఆంగ్లం నుంచి కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన 'ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించాడు. ఆంగ్ల పద్యం "హార్ట్ ఆఫ్ ది నేషన్" కు తెలుగు అనువాదం చేసాడు. శారదా గ్రంథమాలను స్థాపించారు. త్రిలింగ పత్రికలో 'దుందుభి, వికారి' కలం పేర్లతో రాజకీయ వ్యాసాలు రాసారు. 1937లో చీనా-జపాన్ అనే పుస్తకాన్ని రచించారు.

అయినప్పటికీ పూట గడవని స్థితి ఉండడం వల్ల జీవనోపాధి కోసం 1933లో మద్రాసు చేరుకొని అక్కడ గృహలక్ష్మి పత్రిక సంపాదకుడుగా ఉద్యోగంలో చేరాడు. కొంతకాలం తరువాత అక్కడ మానివేసి ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకుడుగా కొద్ది రోజులతర్వాత ఆంధ్రప్రభలో ఆ తర్వాత కొంతకాలం ఆనందవాణికి సంపాదకుడుగా పనిచేసి చివరకు కొంతకాలం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవనం సాగించాడు.

చివరిదశ లో గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కొంత ఆర్థిక సహాయము అందించడం, వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు ప్రతినెలా ఆయనకు కొంత నగదును సహాయంగా ఇవ్వడం వల్ల కుటుంబం గడిచే పరిస్థితి కల్గింది. వివిధ పత్రికలకు, ఆలిండియా రేడియోకి రచనలు చేసి కొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనను బాగా దెబ్బతీశాయి. చివరిదశలో ఒక కన్నుపోయి, పక్షవాతానికి గురై దినస్థితికి చేరుకుంది. చైతన్యమూర్తి గా వెలిగిన గరిమెళ్ల సత్యనారాయణ వార్ధక్య జీవితం దుర్భరం కావడం చాలా బాధాకరం.

స్వాతంత్ర్యానంతరం మన పాలకుల వల్ల కూడా గరిమెళ్ళకు చెప్పుకోదగ్గ సహాయం లభించనందున కొంతమంది మిత్రులు గరిమెళ్ళను 'మాకొద్దీ నల్ల దొరతనం..' అనే గేయం వ్రాయలని అడిగారట. దేశ భక్తుడు, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి కలిగిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదట. వృద్ధాప్యంలో దుర్భరదారిద్ర్యాన్ని అనుభవించిన గరిమెళ్ళ 1952 డిసెంబర్ 18వ తేదీన మరణించాడు. ఆయన అంత్యక్రియలకు కూడా ఇరుగు పొరుగు వారు ఆర్థిక సహాయం చేయవలసి రావడం ఎంతో విచారకరం. అంతటి త్యాగమూర్తినీ తెలుగు ప్రజలైన మనం మరోమారు స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

"గరిమెళ్ళ నిను మరవదు తెలుగు నేల"

గడప రఘుపతి రావు
రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
raghupatiraog@gmail.com
9963499282

# వయోవృద్ధులు భవిష్యత్తుకు పునాది లాంటివాళ్ళు : డిడబ్ల్యూఓ తుల రవి

ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 19 (భారత శక్తి) : వయోవృద్ధులుసమాజంలో భవిష్యత్తుకు పునాది లాంటి వాళ్లు, వారిని గౌరవిస్తూ హక్కులను కాపాడాలని జిల్లా సంక్షేమ అధికారి తుల రవి అన్నారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్జెండర్ల తో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి నుండి కలెక్టరేట్ వరకు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం పై అవగా ర్యాలీని నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారి పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కలెక్టరేట్ ముందు మానవహారం ఏర్పాటుచేసి వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి తుల రవి హాజరై మాట్లాడారు. వయోవృద్ధులే మనదేశానికి వెలకట్టలేని సంపద అని, వారే మన భవిష్యత్తుకు బలమైన పునాది అని, అలాంటి వారిని బలహీనులుగా చూడకుండావారి హక్కులను ప్రతీ ఒక్కరు గౌరవించాలన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్న కాలంలో పెద్దలు అంటే సమాజంలో ఎంతో గౌరవం ఉండేదని, ప్రస్తుతం నేటి ఉరుకుల పరుగుల సమాజంలో వయో వృద్ధులు వృద్ధాశ్రమాల్లో ఉండే పరిస్థితి రావడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో వయో వృద్ధులైన తల్లితండ్రులను పట్టించుకోని వారసుల నుండి పట్టాలను రద్దు చేసి మళ్లీ తిరిగి ఆ వయోవృద్ధులైన తల్లితండ్రుల పేరు మీదనే పట్టాలను మంజూరీ చేయడం జరిగిందని అన్నారు. వయోవృద్ధులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ తరపున వయోవృద్ధులకు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు, కవితా పోటీలు వంటివి ఏర్పాటుచేయడం జరిగిందని, వీటివల్ల వయోవృద్ధుల శారీరక, మానసిక ఉల్లాసానికి ఈ క్రీడలు %డ% పోటీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. మాకు అన్ని విధాలుగా సహకరించి ఈ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని తుల రవి తెలిపారు. ముందుగా జిల్లా వైద్య %డ% ఆరోగ్య శాఖ తరపున మెడికల్ క్యాంపు ఏర్పాటుచేసి వయోవృద్ధులకు పరీక్షలు నిర్వహించి అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల జిల్లా ఫోరం నాయకులు డిసిపిఓ ఓంకార్, వయోవృద్ధుల శాఖ ఇంచార్జీ నాగేంద్ర, ఎఫ్ ఆర్ ఓ గణేష్, డి ఎం సి రమాదేవి, డిసిపియు, సిహెచ్ హెల్,సఖీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

## డబ్ల్యూజేఐ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్, నవంబర్,19(భారతశక్తి ప్రతినిధి):

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడంలో జర్నలిస్టుల నిరంతర శ్రమ ప్రశంస నీయమైనదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇటీవలే ఎన్నికైన బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. కార్యవర్గ సభ్యులందరినీ శాలువాలతో సత్కరించారు. డబ్ల్యూజేఐ జిల్లా అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం కేంద్ర మంత్రిని ఆయన నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియా నిజాలను నిర్భయంగా వెలికి తీయాలని, పూర్తి స్వతంత్రతతో పనిచేయాలని అన్నారు. జర్నలిస్టులు సమాజంలో నెలకొన్న సమస్యలను వెలికి తీసి సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని కేంద్రమంత్రికి డబ్ల్యూజెఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి సత్యనారాయణ పరిచయం చేశారు.



అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా మొగురం రమేష్,నర్సరీ కేదారి,ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్ , మహిళ కార్యదర్శి లావణ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రవీందర్, జి రమేష్, సంయుక్త కార్యదర్శి బూర్ల వెంకటేష్, కోశాధికారి చిటుమల్ల మహేందర్ కార్యవర్గ సభ్యులు జి రామకృష్ణ, కంది శ్రీనివాసరెడ్డి, పి సంతోష్ గౌడ్,జాలి నరేష్, కస్తూరి ప్రభాకర్, గంగం రాజు,కే రవీంద్ర చారి,సిహెచ్ వెంకటేష్, కే కుమార్, గుడికందుల దాసు తదితరులను కేంద్రమంత్రి ఘనంగా సన్మానించారు.

# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ పండుగలా జరపాలి: సీఎం రేవంత్ రెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 19 (భారత శక్తి): రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, సీఎస్ రామకృష్ణారావు, జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని దాదాపు ఒక కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. "మహిళల ఉన్నతి %-% తెలంగాణ ప్రగతి" పేరిట గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల, పట్టణాలలో 35 లక్షల చీరలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మహిళా సమాఖ్య సభ్యులు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీరలు అందేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం పేర్కొన్నారు. వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణ, అమ్మ ఆధర్శ పాఠశాలలు వంటి పలు రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు అద్దె బస్సులు కేటాయించి మహిళలను యజమానులుగా మారుస్తున్నామని తెలిపారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం ప్రకటించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాలకు సభ్యులైన ప్రతి మహిళతో పాటు 18 ఏళ్లు నిండిన అన్ని మహిళలకు చీరలు అందేలా విభాగాలు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు 1,70,331 చీరలు కేటాయించగా, అందులో 1,14,681 చీరలు చేరుకున్నాయని, మిగతా 55,650 చీరలు త్వరలోనే అందనున్నాయని తెలిపారు. చీరలను సురక్షితంగా నిల్వ చేయాలని, నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబర్ 9లోపు పంపిణీ పూర్తి చేసి, పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుండి 8 వరకు కార్యక్రమం నిర్వహించాలన్నారు.



చీరలు పొందిన మహిళల వివరాలను ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరలో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల నిర్మాణానికి అనువైన స్థలాలను వెంటనే గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్, కుమార్ కుమార్, జెడ్పీ సీఈవో గోవింద్, డిపిఒ శ్రీనివాస్, ఏపీడీ చరణ్ దాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, మండల మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## వాట్సప్‌లో భారీ భద్రతా లోపం..
# యూజర్ల డేటా లీక్‌కు అవకాశం!



మెరుగైన సేవలు అందించడంలో భాగంగా వాట్సప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు తీసుకొస్తుంటుంది. యూజర్ల డేటా ఎక్కడా లీక్ కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటూ ఉంటుంది. అయినప్పటికీ.. భారీ భద్రతా లోపం ఒకటి ఈ మధ్య వెలుగులోకి వచ్చింది. దీన్ని యూనివర్సిటీ ఆఫ్ వియన్నా పరిశోధకులు గుర్తించారు. ఈ లోపం వల్ల చాలా మంది కాంటాక్ట్ నంబర్లు బహిర్గతమయ్యే ప్రమాదం ఉందని వెల్లడించారు. ఒకవేళ దీన్ని ఎవరైనా దుర్వినియోగం చేసుకొని ఉంటే చరిత్రలో అతిపెద్ద డేటా లీక్‌గా నిలిచిపోయేదని అభిప్రాయపడ్డారు.

**ఇదీ లోపం..**

సాధారణంగా వాట్సప్‌లో ఎవరినైనా కాంటాక్ట్ చేయడం చాలా సులభం. ఫోన్ నంబర్‌ను ఫోన్‌లో సేవ్ చేసుకుంటే చాలు. వారు వాట్సప్‌లో ఉన్నారో లేదో వెంటనే తెలిసిపోతుంది. చాలా సందర్భాల్లో వారి ప్రొఫైల్ ఫొటో, పేరు కూడా కనిపిస్తాయి. వాట్సప్ సక్సెస్‌కు ఇదొక ప్రధాన కారణం. అయితే, ఇదే ఫీచర్‌ని కొందరు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఎవరైనా ఒక కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా కోట్లాది ఫోన్ నంబర్లను వరుసగా వాట్సప్‌లో చెక్ చేస్తే.. అప్పుడు ఏ నంబర్లు వాట్సప్‌లో యాక్టివ్‌గా ఉన్నాయో ఆ ప్రోగ్రామ్ పసిగడుతుంది. హ్యాకర్లు లేదా డేటా సేకరించే సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాట్సప్ యూజర్ల ఫోన్ నంబర్లు, వారి ఫొటోలు, పేర్లను పెద్ద మొత్తంలో సేకరించే ప్రమాదం ఉంటుంది. ఇది వినియోగదారుల ప్రైవసీకి భంగం కలిగించే విషయం.

**మెటా స్పందన**

ఈ లోపాన్ని ఆసరాగా చేసుకొని కేవలం అరగంటలో దాదాపు 3 కోట్ల మంది యూఎస్ ఫోన్ నెంబర్లను పరిశోధకులు తెలుసుకోగలిగారు. ఆ డేటాబేస్‌ను వెంటనే డిలీట్ చేసి వాట్సప్ మాతృసంస్థ మెటాను అలర్ట్ చేశారు. దీనికిగానూ వియన్నా యూనివర్సిటీకి కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. వారితో కలిసి ఈ లోపంపై లోతుగా అధ్యయనం చేసినట్లు వెల్లడించారు. దీన్ని ఎలా పరిష్కరించాలో మార్గాలను అన్వేషించినట్లు తెలిపారు. అయితే, ఇప్పటి వరకు దీన్ని మాత్రం ఎవరూ దుర్వినియోగం చేయలేదని స్పష్టం చేశారు.

## గూగుల్ ప్లే బెస్ట్ యాప్స్..
# టాప్‌లో జొమాటో డిస్ట్రిక్ట్ యాప్




ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్తమ యాప్స్ జాబితాను ప్రకటించింది. భారత్‌లో ఈ ఏడాది అత్యంత ప్రజాదరణ పొందిన ప్లేస్టోర్ అప్లికేషన్లు, గేమ్స్ జాబితాను వెలువరించింది. వినియోగదారుల అభిరుచులు, స్థానిక సంస్కృతికి అనుగుణంగా రూపుదిద్దుకున్న యాప్స్ ఆదరణ పొందినట్టు గూగుల్ పేర్కొంది. దేశీయంగా ఉత్తమ యాప్‌గా జొమాటోకు చెందిన డిస్ట్రిక్ట్ (మూవీస్ ఈవెంట్స్ డైనింగ్) ఎంపికైంది. గేమ్ విభాగంలో కుకీ రన్ ఇండియా (రన్నింగ్ గేమ్) ఉత్తమ గేమ్‌గా నిలిచింది. ఈ మేరకు గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో యాప్స్ జాబితాను విడుదల చేసింది.

**టాప్ యాప్స్**

జొమాటోకు చెందిన డిస్ట్రిక్ట్ యాప్ ఈ ఏడాది ఎక్కువ ఆదరణ పొందిన యాప్‌గా నిలిచింది. టూన్‌సూత్రా ఈ ఏడాది హిడెన్ జెమ్ యాప్ అవార్డు అందుకుంది. డైలీ ప్లానర్ యాప్‌ను బెస్ట్ ఎవ్రీడే ఎసెన్షియల్ యాప్‌గా ఎంపిక చేశారు. ఫన్ విభాగంలో ఇన్‌స్టాగ్రామ్‌కు చెందిన ఎడిట్స్ యాప్ ముందంజలో నిలిచింది. పర్సనల్ గ్రోత్ విభాగంలో ఇన్‌వీడియో ఏఐ ఉత్తమ యాప్‌గా గూగుల్ ప్రకటించింది. ట్రెండింగ్ విభాగంలో.. షాపింగ్ కేటగిరీలో ఇన్‌స్టామార్ట్ ఈ ఏడాది అత్యంత ట్రెండింగ్ యాప్‌గా నిలిచింది. విద్యార్థుల కోసం ఉద్దేశించిన సీఖో, ఆర్ట్ అండ్ డిజైన్ విభాగంలో అడోబ్ ఫైర్‌ఫ్లై: ఏఐ జనరేటర్ అత్యధికంగా వాడుకలో ఉన్న యాప్‌లుగా గుర్తింపుపొందాయి. గేమింగ్ విభాగంలో కుకీ రన్ ఇండియా 2025లో బెస్ట్ గేమ్‌గా ఎంపికైంది. హారర్ సర్వైవల్ గేమ్ కమ్లాకు బెస్ట్ ఇండీ గేమ్ అవార్డు లభించింది. 'పిక్ అప్ అండ్ ప్లే' కేటగిరీలో కూడా కుకీ రన్ ఇండియా ముందంజలో ఉంది. భారత్‌లో రూపొందించిన ఉత్తమ గేమ్ విభాగంలో రియల్ క్రికెట్ స్వైప్, మల్టీడివైజ్ కేటగిరీలో డిస్నీ స్పీడ్‌స్టార్మ్ అవార్డులు గెలుచుకున్నాయి. మల్టీప్లేయర్ విభాగంలో 8 పూల్ ఫీవర్ టాప్ యాప్‌గా నిలిచింది.

## 1600 సిరీస్ వాడకంపై
# బ్యాంకులకు TRAI డెడ్‌లైన్




దిల్లీ: బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగానికి చెందిన సంస్థలు చేసే కాల్స్‌కు 1600 సిరీస్ వాడకంపై టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కీలక ముందుడుగు వేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, మ్యూచువల్ ఫండ్స్, ఇతర సంస్థలకు గడువు నిర్దేశించింది. ఆ గడువు నుంచి తమ వినియోగదారులకు సేవలందించే విషయమై చేసే కాల్స్‌కు 1600 సిరీస్ నంబర్‌నే తప్పనిసరిగా వాడాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ట్రాయ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకులు సహా అన్ని కమర్షియల్ బ్యాంకులు 2026 జనవరి 1లోగా 1600 సిరీస్‌ను అందిపుచ్చుకోవాలని ట్రాయ్ నిర్దేశించింది. మ్యూచువల్ ఫండ్స్, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు ఫిబ్రవరి 15ను గడువుగా పేర్కొంది. క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు మార్చి 15 నాటికి ఈ సిరీస్‌ను అందిపుచ్చుకోవాలని సూచించింది. సెబీ రిజిస్టర్డ్ ఇంటర్మీడియరీస్ స్వచ్ఛందంగా ఈ సిరీస్‌కు మారాలని పేర్కొంది. ఎన్‌బీఎఫ్‌సీలు, కోఆపరేటివ్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులు, చిన్న కంపెనీలకు మార్చి 1 గడువు నిర్దేశించింది. సెంట్రల్ రికార్డ్‌కీపింగ్ ఏజెన్సీలు, పెన్షన్ ఫండ్ మేనేజర్లు ఫిబ్రవరి 15నాటికి ఈ సిరీస్‌కు మారాలంది. ఇన్సూరెన్స్ సెక్టార్‌కు ఈ సిరీస్‌ను వర్తింపజేసే విషయమై ప్రస్తుతం ఐఆర్‌డీఏఐతో చర్చలు జరుగుతున్నాయని ట్రాయ్ వివరించింది.

**ఎందుకీ సిరీస్?**

పెరుగుతున్న ఆర్థిక నేరాలను అరికట్టేందుకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ ఖాతాదారులను సంప్రదించేందుకు '1600' సిరీస్‌ను ట్రాయ్ తీసుకొచ్చింది. దీనివల్ల అధీకృత సంస్థల నుంచే తమకు ఫోన్ కాల్ వచ్చిందని గుర్తించడం సాధ్యమవుతుందని ట్రాయ్ భావన. ఆ మేర టెలికాం విభాగం (DoT) బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్ రంగానికి ఈ సిరీస్‌ను కేటాయించింది. దీనివల్ల వాళ్లు ఆర్థిక మోసాల బారిన పడే అవకాశాలు తగ్గుతాయన్నది ట్రాయ్ ఉద్దేశం.


## వన్డేలకు దూరం..
# టీ20లపైనే హార్దిక్ పాండ్య ఫోకస్!



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఇప్పట్లో వన్డేలు ఆడే సూచనలు కనిపించడం లేదు. ఈ ఏడాది జరిగిన ఆసియా కప్ సూపర్4లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా అతడు గాయపడ్డాడు. ఎడమ కాలి తొడ కండరానికి గాయం కావడంతో తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లో ఆడలేదు. ప్రస్తుతం కోలుకుంటున్న హార్దిక్.. వన్డేల మ్యాచ్‌లకు దూరంగా ఉంటాడని తెలుస్తోంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉండటంతో ప్రస్తుతానికి ఆ ఫార్మాట్‌పైనే ఫోకస్ పెట్టాలని అతడు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. డిసెంబరులో సఫారీలతో, జనవరిలో న్యూజిలాండ్‌తో టీమ్ఇండియా మూడు వన్డేల సిరీస్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో హార్దిక్ ఆడడు. ఫిబ్రవరి మార్చిలో టీ20 వరల్డ్ కప్ జరగనుంది. ఐపీఎల్ 2025 సీజన్ మొదలవుతుంది. మళ్లీ భారత్ 2026 జులైలో ఇంగ్లాండ్‌తో వన్డేలు ఆడనుంది. 'హార్దిక్ తొడ కండరం గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నాడు. అతను తన ఆర్‌టీపీ (రిటర్న్ టు ప్లే) రొటీన్‌లను చేస్తూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉన్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత అతను తన వర్క్‌లోడ్‌పై దృష్టిపెట్టాలి. నేరుగా వన్డేలు ఆడటం రిస్క్‌తో కూడుకున్నది. టీ20 ప్రపంచ కప్ వరకు హార్దిక్ టీ20లపై దృష్టిపెడతాడు' అని బీసీసీఐ వర్గాలు పీటీఐకి తెలిపాయి. డిసెంబరు 9 నుంచి భారత్, సౌతాఫ్రికా మధ్య ఐదు టీ20 సిరీస్ మొదలుకానుంది. హార్దిక్ అంతకంటే ముందు మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున ఆడే ఛాన్స్ ఉంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా సఫారీలతో వన్డే సిరీస్ నుంచి ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇస్తారని సమాచారం.




## ఐసీసీ అండర్19 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల..
## వేర్వేరు గ్రూప్‌ల్లో భారత్, పాక్



ఐసీసీ అండర్19 వరల్డ్ కప్ 2026 షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరగనున్న ఈ టోర్నీకి జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమివ్వనున్నాయి. ఆరంభ మ్యాచ్‌లో భారత్, యూఎస్‌ఏ తలపడతాయి. మొత్తం 41 మ్యాచ్‌లు నిర్వహిస్తుండగా 16 జట్లు పాల్గొంటాయి. టంజానియా తొలిసారి పోటీపడుతోంది. ఫైనల్‌కు హరారే వేదిక. గత ఎడిషన్ మాదిరిగానే ఈ సారి కూడా భారత్, పాకిస్థాన్ వేర్వేరు గ్రూప్‌ల్లో ఉన్నాయి. గ్రూప్‌ఏలో భారత్, బంగ్లాదేశ్, యూఎస్ఏ, న్యూజిలాండ్.. గ్రూప్ బిలో జింబాబ్వే, పాకిస్థాన్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్.. గ్రూప్‌సిలో ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక.. గ్రూప్‌డిలో టంజానియా, వెస్టిండీస్, అఫ్గానిస్థాన్, సౌతాఫ్రికా ఉన్నాయి. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ప్రతి జట్టు గ్రూప్‌లోని మిగతా టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్ఎ, గ్రూప్ డిలలో టాప్3లో నిలిచిన జట్లు సూపర్ 6కు అర్హత సాధిస్తాయి. మిగతా రెండు గ్రూప్‌లకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది. రెండు సూపర్6 గ్రూప్‌ల్లో టాప్2లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరతాయి. సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంది. 2024లో జరిగిన ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా నాలుగోసారి ఛాంపియన్‌గా నిలిచింది. అత్యధికంగా భారత్ ఐదు టైటిళ్లు (2000, 2008, 2012, 2018, 2022) సాధించింది.

**భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..**

జనవరి 15 యూఎస్‌ఏతో.. బులావాయో
జనవరి 17 బంగ్లాదేశ్‌తో.. బులావాయో
జనవరి 24 న్యూజిలాండ్‌తో.. బులావాయో

# వెస్టిండీస్ బ్యాటర్ అరుదైన రికార్డు..
## క్రికెట్ చరిత్రలో తొలిసారి



వెస్టిండీస్ కెప్టెన్, వికెట్‌కీపర్ షైయ్ హోప్ క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం టెస్టు హోదా కలిగిన అన్ని జట్లపై అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా అవతరించాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో హోప్ (109*; 69 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేసి ఈ ఘనత సాధించాడు. కివీస్‌పై అతను శతకం చేయడం ఇదే తొలిసారి. 32 ఏళ్ల షైయ్ హోప్.. ఇప్పటివరకు టెస్టుల్లో ఇంగ్లాండ్‌పై రెండు, భారత్‌పై ఒక సెంచరీ చేశాడు. వన్డేల్లో అఫ్గానిస్థాన్ (1), బంగ్లాదేశ్ (3), ఇంగ్లాండ్ (2), భారత్ (3), పాకిస్థాన్ (2), సౌతాఫ్రికా (1), శ్రీలంక (2), న్యూజిలాండ్ (1), ఐర్లాండ్ (1), జింబాబ్వే (1)పై సెంచరీలు చేశాడు. టీ20ల్లో ఇదే ఏడాది ఆస్ట్రేలియాపై ఓ శతకం బాదాడు.

*** ఈ మ్యాచ్‌లో హోప్ నెలకొల్పిన మరిన్ని రికార్డులివీ..**

* ఈ ఏడాది వెస్టిండీస్ తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు (1489) చేసిన ఆటగాడిగా నిలిచాడు.
* ఈ ఇన్నింగ్స్‌తో షైయ్ హోప్ వన్డేల్లో 6 వేల పరుగుల మార్కు (142 ఇన్నింగ్స్‌ల్లో) దాటాడు. వివ్ రిచర్డ్స్ (141) తర్వాత అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన రెండో విండీస్ ఆటగాడిగా రికార్డు సాధించాడు.
* వన్డేల్లో హోప్‌కిది 19వ సెంచరీ. ఈ క్రమంలోనే దిగ్గజ బ్యాటర్ బ్రియాన్ లారాను సమం చేశాడు. క్రిస్ గేల్ (25) శతకాలతో అగ్రస్థానంలో ఉన్నాడు.
* వన్డే కెప్టెన్‌గా షైయ్ హోప్ ఆరో సెంచరీ చేసి లారా (5)ని అధిగమించాడు.
* వన్డేల్లో వికెట్‌కీపర్, కెప్టెన్‌గా అత్యధిక సెంచరీలు (6) చేసిన ఎంఎస్ ధోనీ రికార్డును హోప్ సమం చేశాడు.

ఇక, మ్యాచ్ విషయానికొస్తే వర్షం కారణంగా ఆటను 34 ఓవర్లకు కుదించగా.. న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత విండీస్ 9 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని కివీస్.. మూడు బంతులు మిగిలుండగానే ఛేదించింది. డేవాన్ కాన్వే (90; 84 బంతుల్లో); రచిన్ రవీంద్ర (56; 46 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. టామ్ లాథమ్ (39*; 29 బంతుల్లో), మిచెల్ శాంట్నర్ (34*; 15 బంతుల్లో) చివర్లో దూకుడుగా ఆడి జట్టును గెలిపించారు.




## ‘120 బహదూర్’ విడుదలకు..
# దిల్లీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్...

‘120 బహదూర్’ సినిమా విడుదలకు దిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో, చిత్ర బృందం ముందుగా ప్రకటించిన తేదీనే (ఈ నెల 21) సినిమా విడుదల కానుంది. 1962 ఇండియా- చైనా మధ్య జరిగిన రజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రమిది. షైతాన్ సింగ్‌గా ఫర్హాన్ అక్తర్ నటించారు. రాశీఖన్నా కీలక పాత్ర పోషించారు. రజనీశ్ దర్శకుడు. ట్రైలర్ రిలీజైన తర్వాత ఈ సినిమాపై కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. అహిర్ జవాన్లకు తగిన గుర్తింపు ఇవ్వకుండా.. మేజర్ షైతాన్ ప్రధానంగా సినిమాని తెరకెక్కించారంటూ సంయుక్త్ అహిర్ రెజిమెంట్ మోర్చా ఆరోపించింది. ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను సవాలు చేస్తూ దిల్లీ హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. సినిమా విడుదలను ఆపాలని, టైటిల్‌పైనా అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ‘120 వీర్ అహిర్’ పేరు పెట్టేలా చిత్ర బృందాన్ని ఆదేశించాలని కోరింది. పిటిషన్ నేడు విచారణకు వచ్చింది. సినిమా విడుదల సమయం సమీపిస్తున్న వేళ పేరు మార్పునకు ఆదేశించడాన్ని న్యాయస్థానం నిరాకరించింది. టైటిల్ మార్చకపోయినా.. 120 మంది సైనికులకు నివాళిగా వారి పేర్లను సినిమా ఆఖరులో ప్రదర్శిస్తామని నిర్మాత తరఫు న్యాయవాది ఈ సందర్భంగా తెలిపారు.

## సినిమా

# తప్పు చేసిన



2006లో కన్నడ మూవీ ఐశ్వర్యలో టైటిల్ పాత్రలో నటించిన దీపికా పదుకొణె ఆ మరుసటి ఏడాది బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. ఓం శాంతి ఓం సినిమాలో షారుక్ ఖాన్ సరసన ద్విపాత్రాభినయం చేసింది. అప్పటి నుంచి కల్కి 2898 ఏడీ వరకు ఎన్నో బ్లాక్‌బస్టర్ మూవీల్లో నటించిన ఈ భామ.. కొన్ని సార్లు స్క్రిప్ట్ ఎంపికలో తప్పులు చేసిందట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి అభిప్రాయలు పంచుకున్న నటి.. కొన్ని ప్రాజెక్టులు కమర్షియల్‌గా హిట్ కాకపోవచ్చని, పెద్ద సినిమాలు కూడా కాకపోవచ్చని, అయితే తాను ఆ వ్యక్తులను, ఆ కథలోని సందేశాన్ని నమ్మి అంగీకరిస్తానని చెప్పింది. గతంలో ఇంత స్పష్టంగా ఆలోచించలేక పోయేదట. రెమ్యూనరేషన్ ముఖ్యం కాదని, అందుకు విరుద్ధమైన వాస్తవాలు కూడా ఉంటాయని వివరించింది. ప్రస్తుతం ఆమె రెండు భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. వాటిలో షారుక్ సరసన నటిస్తున్న కింగ్ మూవీ ఒకటి కాగా.. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రానున్న చిత్రం రెండోది.




# నయన తారకు స్పెషల్ గిఫ్ట్

నయనతారకు ఆమె భర్త విఘ్నేశ్ శివన్ సందర్భం వచ్చినప్పుడల్లా గిఫ్టులతో తన ప్రేమను వ్యక్తం చేస్తూ ఉంటాడు. ఇవాళ నయనతార 41వ వసంతంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నయనతారకు ఆమె భర్త విఘ్నేశ్ ఖరీదైన బహుమతి ఇచ్చారు. ప్రతి ఏడాది లగ్జరీ వాహనాలను బహుమతిగా ఇచ్చే విఘ్నేశ్ ఈ సంవత్సరం కూడా అదే ఫాలో అయ్యారు. రోల్స్ రాయిస్ బ్లాక్ బ్యాడ్జ్ స్పెక్టర్‌ను గిఫ్ట్‌గా ఇచ్చి విషెస్ చెప్పారు. దీని విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. 2023లో విఘ్నేశ్ నయన్‌కు మెర్సిడెస్ మేబాచ్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు. దీని విలువ రూ.3 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. 2024లో మెర్సిడెస్ బెంచ్ మేబ్యాక్ జీఎల్ఎస్ 600ను బహుమతిగా ఇచ్చారు. ఇది రూ.5 కోట్లు ఉండొచ్చని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ ఏడాది దాన్ని డబుల్ చేస్తూ రూ.10కోట్ల గిఫ్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## శ్రియ పేరుతో నకిలీ వాట్సప్.. స్పందించిన నటి



నటి అదితిరావు హైదరి పేరుతో ఇటీవల నకిలీ వాట్సప్ క్రియేట్ చేసి ఒక వ్యక్తి ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో నటి శ్రియ శరణ్ (ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ‘‘ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటివారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులను నేను కలిసి వర్క్ చేయనున్న వారికి మెసేజ్‌లు చేస్తున్నాడు. అందరూ అప్రమత్తంగా ఉండండి’’ అంటూ శ్రియ తెలిపారు. తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి ఇటీవల విజ్ఞప్తి చేశారు. ‘‘నా పేరుతో పాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఫొటోషూట్ లాంటి వాటికోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా arh connect ద్వారా తెలియజేయండి’’ అని పేర్కొన్నారు.

## ఇలాంటి సినిమాలో నటిస్తానని అనుకోలేదు: చిరంజీవి



కౌబాయ్ సినిమాలంటే తనకు ఇష్టమని, అలాంటి చిత్రంలో తాను నటిస్తానని ఊహించలేదని చిరంజీవి అన్నారు. 35 ఏళ్ల క్రితం నటించిన ‘కొదమసింహం’ చిత్రాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 1990లో విడుదలైన ఈ సినిమా ఈ నెల 21న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీమియర్ ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మురళీ మోహన్ రావు, సంగీత దర్శకుడు కోటి తదితరులు పాల్గొన్నారు. స్పెషల్ వీడియో ద్వారా చిరంజీవి ఈ సినిమాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ‘‘కొదమసింహం’లోని నా స్టిల్ చాలా పాపులర్. ఆ లుక్‌ను నేను బాగా ఇష్టపడటంతో నిర్మాతలు దాన్ని ఫ్రేమ్ చేసి కానుకగా ఇచ్చారు. మా ఇంట్లో ఇప్పటికీ ఉంది. నేను కౌబాయ్ చిత్రంలో నటిస్తానని ఎప్పుడూ ఊహించలేదు. అప్పటికి కృష్ణ గారు నటించిన ‘మోసగాళ్లకు మోసగాడు’ రికార్డులు సృష్టించింది. అలాంటి నేపథ్యంతో మరో సినిమా చేయడం సాహసమనే చెప్పాలి.



# సాయి సేవకే అంకితం

సినీ ఇండస్ట్రీలో చాలా మంది తాము ఊపిరి ఉన్నంత వరకు సినిమాల్లో నటిస్తూ ఉండాలని కోరుకుంటారు. కానీ అందుకు భిన్నంగా సినిమా జీవితానికి రిటైర్మెంట్ ప్రకటించింది సీనియర్ నటి తులసి. డిసెంబరు 31 తర్వాత పూర్తిగా సాయిబాబా సేవకే అంకితం అవుతానని చెప్పింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ పోస్టు పెట్టింది. తులసి కేవలం మూడు నెలల పసిపిల్లగా సినిమాల్లోకి అడుగుపెట్టింది. ఆమె తల్లి మహానటి సావిత్రికి సన్నిహితురాలు కావడంతో జీవన తరంగాలు మూవీలో ఊయలలో కనిపించే శిశువు పాత్రలో కనిపించింది. ఇక నాలుగేళ్లకే బాలనటిగా వరుస చిత్రాల్లో నటిస్తూ పలు భాషల్లో ప్రాచుర్యం పొందింది. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, భోజ్‌పురి భాషల్లో ఇప్పటి వరకు 300లకు పైగా సినిమాల్లో నటించింది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం ఆరంగేట్రం ఆమెకు ప్రత్యేక గుర్తింపు తేగా.. తెలుగు చిత్రాల్లో తులసి నటనకు కొత్త దిశ తెచ్చిన సినిమాల్లో శంకరాభరణం ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రభాస్, అల్లు అర్జున్, రవితేజ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో తల్లి పాత్రల్లో నటించింది.

# ఉక్కు మహిళ దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

* కార్యక్రమం నిర్వహించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి..
* పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నరసింహా రెడ్డి..



హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని బడంగ్ పేట్ చౌరస్తాలో మొదటి దేశ మహిళా ప్రధాని ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇంచార్జీ అధ్యక్షులు మార్కెట్ కమిటి డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆ మహనీయురాలి చిత్రపటానికి నివాళులు అర్పించారు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద ప్రజలకు భూములు పంచి పెట్టడం మొదలుకొని నివాసాలు ఏర్పాటు చేసుకోవడానికి సంక్షేమ పథకాలు తీసుకొని వచ్చిన మహనీయురాలు అని అన్నారు. అనంతరం బడంగ్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు అరటి పండ్లు పంపిణీ చేసి జయంతి వేడుకలు నిర్వహించి అక్కడే పాఠశాలలో తల్లిదండ్రుల మీటింగ్ లో పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్మేటి అమరేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, బందారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, నాయకులు నవారు మల్లారెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, బాలింగని జంగయ్య, సూర్యగంటి విజయ్, పుట్టగల్ల జగన్, ఐలమ్మ, రమేష్ గౌడ్, అఫ్జల్, టేకుల సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సతీష్ గౌడ్, ఇక్కే శ్రీనివాస్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదల పెన్నిధి సీఎం సహాయనిధి

: శాంతవ్వ ఇంటికెళ్లి పరామర్శించిన కిచ్చెన్న

బాసగూడ,తుక్కుగూడ: మహేశ్వరం.నవంబర్ 19 (భారత శక్తి ప్రతినిధి): సీఎం సహాయనిధి ఎంతోమంది నిరుపేదలకు మేలు చేస్తూనే ఉందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ బాసగూడకు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న శాంతమ్మను ఆమె ఇంటికే వెళ్లి కిచ్చెన్న పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి శ్రీధర్ బాబు చొరవతో కొద్ది రోజుల క్రితం శాంతమ్మకు LOC (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను కేఎల్ఆర్ కార్యాలయంలో అందజేశారు. చికిత్సకు సంబంధించిన మొత్తం వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించిందని స్థానిక నాయకుడు లక్ష్మణ్ తెలిపారు.గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న శాంతమ్మకు భవిష్యత్‌లో కూడా అవసరమైన సహాయం అందిస్తామని, వైద్య ఖర్చుల విషయంలో అండగా నిలుస్తామని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

* టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతిపత్రం...
* ఫీజు రాయితీ ఇవ్వని పాఠశాలపై కఠిన చర్యలు ఉంటాయి...
* జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జర్నలిస్టులకు స్పష్టమైన హామీ....
* త్వరలో డిఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం....



రంగారెడ్డి జిల్లా, నవంబర్ 19 (భారత శక్తి) : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు,కార్పొరేటు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి టిడబ్ల్యుజేఎఫ్ నాయకులు జర్నలిస్టులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గణేష్, ప్రధాన కార్యదర్శి సైదులు ఉపాధ్యక్షులు చంద్రశేఖర్,మణి కుమార్, రాందాస్,జిల్లా సహాయ కార్యదర్శులు ప్రభాకర్, నర్సింహ్మా, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దేవేందర్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజా పాషా, శ్రీనివాస్, తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని అదేవిధంగా ఇల్లు స్థలాలు, హెల్త్ కార్డులు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించారు.

* ఫీజు రాయితీ ఇవ్వని పాఠశాలలపై కఠిన చర్యలు ఉంటాయి: జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా పరిధిలో పనిచేస్తు అక్రిడేషన్ కలిగివున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50% ఫీజు రాయితీ ఇవ్వాలని గతంలోనే ఆదేశాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. త్వరలోనే డిఇఓతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లలో ఫీజు రాయితీ ఇవ్వటానికి నిరాకరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. జర్నలిస్టులు తమ పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో రాయితీ దక్కని పక్షంలో నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాయితీ నిరాకరించిన పాఠశాలలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్రిడేషన్ల అంశానికి వస్తే ఈ సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు,ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్ష,కార్యదర్శులు చిలువేరు యాదగిరి, జగన్,షాద్నగర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్, గౌడ్ నరేష్,చేవెళ్ల అధ్యక్షులు రాజు, మహేశ్వరం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహా, సురేందర్, రాజేందర్ నగర్ అధ్యక్షులు గోపాల్, ఎల్బీనగర్ అధ్యక్షులు శ్రీ రాములు, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహ రెడ్డి, షాద్నగర్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు గౌడ్, సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అంటున్నారు : ఎమ్మెల్యే కూనంనేని



హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ''మావోయిస్టుల ఎన్‌కౌంటర్లను తక్షణమే ఆపివేయాలి. ఎన్‌కౌంటర్లపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాం. మావోయిస్టుల పక్షాన న్యాయ పోరాటం చేస్తాం. హిడ్మా కోరితే ఆశ్రయం ఇచ్చే వాళ్లం. అతన్ని నేనే డీజీపీకి సరెండర్ చేయించే వాడిని. హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అంటున్నారు. ఎన్‌కౌంటర్ అంటే పరస్పరం కాల్పులు జరపడం. ఏకపక్షంగా కాల్పులు జరపడాన్ని బండి సంజయ్ ఎన్‌కౌంటర్ అంటున్నారు. మావోయిస్టులతో చర్చించి సమస్యలను తెలుసుకోవాల్సింది పోయి చంపుతున్నారు. 2026 మార్చి కల్లా మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అంతం చేయడానికి ఇదేమైనా యుద్ధమా? కాల్పులు విరమించుకుంటున్నామని ప్రకటించినా చంపుతున్నారు. దండకారణ్యంలో ఖనిజాల కోసమే మావోయిస్టులను చంపుతున్నారు'' అని కూనంనేని ఆరోపించారు.

## ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళి

* ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఘన శ్రీకారం..



హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): మాజీ ప్రధానమంత్రి, దేశ చరిత్రలో అపూర్వ ముద్ర వేసిన ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, మేయర్ విజయలక్ష్మితో పాటు గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తరువాత నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న అత్యంత క్లిష్టసమయంలో దేశాన్ని ముందుండి నడిపించిన ధీర నాయకురాలు ఇందిరా గాంధీ అని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారని చెప్పారు.బ్యాంకుల జాతీయాకరణ, అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ చట్టం తీసుకు వచ్చి పేదల కోసం భూముల పంపిణీ చేయడం, పేదలకు గృహాల నిర్మాణం - ఇవి అన్నీ ఇందిరమ్మ పాలనలోనే సాధ్యమైందని సీఎం విశ్లేషించారు. పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో దేశాన్ని కాపాడిన ధీశాలి ఇందిరమ్మ అని పేర్కొన్నారు. అటు తర్వాత సీఎం రేవంత్ రెడ్డి పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను అందజేసి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు.


## ఐ-బొమ్మ కేసు..
### ఇమ్మడి రవి కస్టడికి నాంపల్లి కోర్టు అనుమతి



హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): ఐబొమ్మకేసులో అరెస్ట్ అయిన ఇమ్మడి రవిని కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐబొమ్మ కీలక సూత్రధారిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రవిని ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు.. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ విచారణలో మరికొన్ని కీలక అంశాలు వెలుగు చూసే అవకాశముంది. ఇప్పటికే ఇమంది రవి

## జీ20 సదస్సు.. దక్షిణాఫ్రికా పర్యటనకు ప్రధాని

డిల్లీ, నవంబర్ 19 (భారత శక్తి): ఈ నెల 22, 23వ తేదీల్లో దక్షిణాఫ్రికా వేదికగా నిర్వహించనున్న జీ20 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ఇందుకోసం ఆయన ఈ నెల 2123వ తేదీల్లో ఆ దేశంలో పర్యటించనున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. అదేవిధంగా ఇండియా బ్రెజిల్ దక్షిణాఫ్రికా (ఐబీఎస్ఏ) నేతల సమావేశంలోనూ పాల్గొననున్నట్లు తెలిపింది. ''20వ జీ20 దేశాల అధినేతల సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో పర్యటించనున్నారు. వరుసగా నాలుగోసారి ఓ



గ్లోబల్ సౌత్ దేశంలో జరుగుతున్న జీ20 శిఖరాగ్ర సమావేశం ఇది. సదస్సులోని మూడు సెషన్లలో ప్రధాని ప్రసంగించనున్నారు. సమగ్ర, స్థిరమైన ఆర్థిక వృద్ధి, వాణిజ్యం; వాతావరణ మార్పులు, ఆహార వ్యవస్థలు; అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధస్సు అంశాలపై మాట్లాడనున్నారు. వివిధ దేశాధినేతలతోనూ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు'' అని విదేశాంగశాఖ వెల్లడించింది. ఈ జీ20 సదస్సుకు అమెరికా నుంచి ఎవరూ హాజరు కాబోరని ఇటీవల ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికాలో మైనారిటీలైన శ్వేతజాతి రైతులను చూస్తున్న తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అంతకుముందు మయామిలో చేసిన ఓ ప్రసంగంలో దక్షిణాఫ్రికాను జీ20 గ్రూప్ నుంచి తొలగించాలని కూడా డిమాండ్ చేశారు.

## నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో
### ఏసీబీ సోదాలు

నిజామాబాద్,నవంబర్ 19 (భారత శక్తి): నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేపట్టింది. టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఏసీబీ అధికారులు దృష్టిపెట్టారు. ఫైళ్లు, రికార్డులు, డిజిటల్ డేటాను పరిశీలించారు. నిబంధలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని, భవన నిర్మాణాల కోసం భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ ఈ సోదాలు చేపట్టినట్లు సమాచారం.

## అమిత్‌షాది మాటంటే మాటే.. మార్చిలోపు మావోయిజం అంతం

హుజూరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే.. అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వాళ్ల చావులకు కారకులయ్యారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. ''నక్సలైట్లు చనిపోతే వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల గుండెకోత మీకేం తెలుసు? నక్సలైట్ల తుపాకీని సమర్థించిన వారు కూడా నేరస్థులే. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాది మాటంటే మాటే. మార్చిలోపు మావోయిజాన్ని పూర్తిగా అంతమొందిస్తాం''అని బండి సంజయ్ అన్నారు.



# ప్రేమ, సేవకు ప్రతిరూపం సత్యసాయి..



పుట్టపర్తి, నవంబర్ 19 (భారత శక్తి): ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ప్రేమ, సేవ, శాంతి, పరిష్కారానికి బాబా నిలువెత్తు నిదర్శనమని ఆయన కొనియాడారు. పుట్టపర్తిలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబా సేవలను స్మరించుకుంటూ ప్రధాని రూ.100 విలువైన స్మారక నాణేన్ని, ప్రధాని మోదీతో కలిసి సీఎం చంద్రబాబు స్మారక తపాలా బిళ్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భగవాన్ నడిచిన ఈ పుణ్యభూమిలో ఆయన శత జయంతి వేడుకలు జరుపుకోవడం అదృష్టమని అన్నారు. "లవ్ ఆల్, సర్వ్ ఆల్, హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్" అనేది సత్యసాయి చూపిన మార్గమని, విశ్వశాంతి, సకల జనుల సంతోషం అనే ఉన్నత భావనతో ఆయన జీవించారని గుర్తుచేశారు. "మానవ సేవే మాధవ సేవ" అని కేవలం బోధించడమే కాకుండా, దాన్ని ఆచరించి ఫలితాలు చూపించిన మహనీయుడు బాబా అని పేర్కొన్నారు. ప్రేమ ఒక్కటే మతమని, హృదయం ఒక్కటే భాష అని, మానవత్వమే కులమని చాటిచెప్పారని, ఆయన బోధనలతో నాస్తికులను సైతం ఆధ్యాత్మికత వైపు నడిపించారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రజలను తన మనో దర్శనంతో ప్రభావితం చేశారని అన్నారు. బాబాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, భక్తులను ఆయన ఎంతో ప్రేమగా 'బంగారూ' అని పిలిచే పిలుపు ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. సత్యసాయి ట్రస్ట్ కార్యక్రమాలపై బాబా పలుమార్లు తనతో చర్చించారని నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. విలువలతో కూడిన విద్యను 1వ తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా అందించిన ఘనత సత్యసాయిదని అన్నారు. నేడు 102 సత్యసాయి విద్యాలయాల ద్వారా సుమారు 60,000 మంది విద్యార్థులు ఉత్తమ విద్యను పొందుతున్నారని వివరించారు. అదేవిధంగా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, జనరల్ ఆసుపత్రులు, మొబైల్ క్లినిక్‌ల ద్వారా ప్రతిరోజూ వేలాది మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడానికి ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టైనా ప్రాజెక్టును పూర్తి చేయాలని బాబా సంకల్పించారని చంద్రబాబు ఓ ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయం తెలిసిన భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కోట్లాది రూపాయల విరాళాలు ఇచ్చారని, దీంతో రూ.550 కోట్ల వ్యయంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని 1600 గ్రామాలకు, 30 లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీరు అందిందని వివరించారు. చెన్నై తాగునీటి పథకం ఆధునికీకరణకు రూ.250 కోట్లు వెచ్చించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని, ఆయన స్ఫూర్తిని, చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చంద్రబాబు పిలుపునిచ్చారు.

*** సత్యసాయి ఒక అరుదైన ఆధ్యాత్మిక శక్తి: పవన్ కల్యాణ్**

ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్యసాయి బాబాను 'ప్రపంచానికి వెలుగులిచ్చే అరుదైన ఆధ్యాత్మిక శక్తి'గా అభివర్ణించారు. అనంతపురం జిల్లాలో ఆయన జన్మించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని తెలిపారు. విదేశాల్లో సైతం సత్యసాయికి లక్షలాది మంది భక్తులు ఉండటం గర్వకారణమన్నారు. ప్రభుత్వాలు ఆలోచించకముందే జల్‌జీవన్ మిషన్ తరహాలో సామాన్యులకు తాగునీరు అందించిన మహనీయుడని కొనియాడారు. సచిన్ తెందూల్కర్ వంటి ప్రముఖులతో పాటు ఎందరో ఐఏఎస్ అధికారులు సైతం ఆయన ప్రభావానికి లోనయ్యారని గుర్తుచేశారు. సత్యసాయి బాబా స్ఫూర్తిని తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## 'వోకల్ ఫర్ లోకల్' మంత్రం..
## పుట్టపర్తి వేదికగా ప్రధాని మోదీ కీలక పిలుపు

పుట్టపర్తి, నవంబర్ 19 (భారత శక్తి): శ్రీ సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవా మార్గాలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో జరిగిన శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.100 స్మారక నాణేన్ని, ప్రత్యేక తపాలా బిళ్లను ఆవిష్కరించారు. హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా జీవితం 'వసుధైవ కుటుంబం' అనే భారతీయ భావనకు నిలువుటద్దమని కొనియాడారు. "లవ్ ఆల్, సర్వ్ ఆల్" అనే ఆయన సందేశం అజరామరమని, బాబా భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన స్థాపించిన సంస్థలు మానవ సేవే మాధవ సేవ స్ఫూర్తితో సేవలను కొనసాగిస్తున్నాయని ప్రశంసించారు. భుజ్ భూకంపం వంటి విపత్తుల సమయంలో సత్యసాయి సేవాదళ్ అందించిన సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో 100 గిర్ జాతి ఆవులను పేద కుటుంబాలకు ప్రధాని తన చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' ద్వారా పేదల జీవితాల్లో మార్పు తెస్తున్నామని వివరించారు.
దేశం 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు సాగుతోందని, దీనికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ 'వోకల్ ఫర్ లోకల్' మంత్రాన్ని స్వీకరించి, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. తద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలు బలపడి 'ఆత్మనిర్భర్ భారత్' సాకారమవుతుందని పేర్కొన్నారు. సత్యసాయి బాబా ప్రేరణతో కరుణ, శాంతి మార్గంలో పయనిస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

## మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ..
# హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి శుభవార్త

హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): భాగ్యనగర మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరించుకోవాలని యోచిస్తున్నట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్‌లో అదనంగా 160 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రులు, అధికారుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి ఖట్టర్ విలేకరులతో మాట్లాడారు. "మెట్రో విస్తరణ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం. ఏ లైన్లకు ఆమోదం తెలపాలనే దానిపై మార్చి నాటికి కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది" అని ఖట్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో ఉన్న హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసేందుకు ప్రాథమికంగా అంగీకారానికి వచ్చిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో మెట్రోను విస్తరించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

*** విశాఖ, విజయవాడ మెట్రోలు, అమరావతి అభివృద్ధి**

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో కూడా మెట్రో ప్రాజెక్టులకు డిమాండ్ ఉందని మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. ఆ ప్రతిపాదనలను కూడా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అమరావతిని ప్రధాన నగరంగా అభివృద్ధి చేసే ఆలోచన కూడా కేంద్రానికి ఉందని, ప్రస్తుత ప్రణాళికల ఆధారంగా అవసరమైన నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు.

*** మూసీ ప్రక్షాళనకు కేంద్రం చేయూత**

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపైనా ఖట్టర్ మాట్లాడారు. "మొదటి దశలో 9 కిలోమీటర్ల మేర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం. నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రతి 5 కిలోమీటర్లకు ఒక మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. మూసీ ప్రక్షాళనకు అమృత్ పథకం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ద్వారా నిధులు సమకూరుస్తాం" అని వివరించారు. ఇదే సమయంలో, పట్టణాభివృద్ధికి కేటాయించిన నిధులను రాష్ట్రాలు సక్రమంగా ఎందుకు వినియోగించుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మూసీ నది నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఒక టెస్టింగ్ ల్యాబొరేటరీకి ఆమోదం లభించిందని, హైదరాబాద్ మెట్రోకు 50:50 వాటా పద్ధతిపై చర్చలు జరిగాయని ధ్రువీకరించారు.

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు కసరత్తు
## ప్రారంభించిన ఎన్నికల సంఘం

ఢిల్లీ, నవంబర్ 19 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను ప్రకటించింది. రేపటి నుంచి ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసే అవకాశం ఉంది. సోమవారం మంత్రి మండలిలో స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించిన నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ, ఎన్నికల సంఘం ఈ మేరకు దృష్టి సారించాయి.

## ఢిల్లీ పేలుడు...
# బయటకు వెళితే అనుమానంగా చూస్తున్నారు

హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎర్రకోట సమీపంలో కారు పేలుడు తర్వాత కశ్మీరీలను అందరూ అనుమానంగా చూస్తున్నారని ఆయన అన్నారు. కొంతమంది చేసిన తప్పులకు కశ్మీరీలందరినీ బాధ్యులను చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఉగ్ర కుట్రలకు తమను ఎక్కడ బాధ్యులను చేస్తారేమో అనే భయంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కూడా కశ్మీరీలు భయపడుతున్నారని అన్నారు. జమ్ము కశ్మీర్ నెంబర్ ఉన్న వాహనాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలన్నా తాను కూడా భయపడుతున్నానని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఢిల్లీలో జరిగిన పేలుడుకు కశ్మీర్‌లోని కొందరు బాధ్యులు కావడం వల్ల మొత్తం కశ్మీర్ ప్రజలు అందులో భాగమనే భావనను సృష్టిస్తున్నారని అన్నారు. తాను ఇతర రాష్ట్రాలకు వెళితే ఎవరు ఎక్కడ ఆపి వాహనాన్ని తనిఖీ చేస్తారోనని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తానని అన్నారు. ప్రస్తుతం జమ్ము కశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాన్ని ఢిల్లీలో నడపడం కూడా నేరంగా పరిగణిస్తున్నారని అన్నారు. అందరూ మనల్ని అనుమానాస్పద దృష్టితో చూస్తున్నప్పుడు, మనకు సంబంధం లేని అంశంలో మనల్ని కించపరుస్తున్నప్పుడు బయటకు వెళ్లడం కష్టమనిపిస్తుందని అన్నారు. అందుకే ప్రస్తుతం కశ్మీర్ ప్రజలు తమ పిల్లలను బయటకు పంపడానికి ముందుకు రావడం లేదని అన్నారు.

## షేక్ హసీనా అప్పగింతకు భారత్
## విముఖత... బంగ్లాదేశ్ కీలక నిర్ణయం

బంగ్లాదేశ్, నవంబర్ 19 : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని భావిస్తోంది. మానవత్వం మరిచి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్న కేసులో షేక్ హసీనాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత సంవత్సరం దేశం విడిచిన షేక్ హసీనా, మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లాదేశ్ ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేస్తున్నారని బంగ్లాదేశ్ దినపత్రిక 'ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులపై రెడ్ నోటీసులు జారీ చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇదివరకే



ఇంటర్‌పోల్‌కు అరెస్టు వారెంటుతో పాటు దరఖాస్తు సమర్పించినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వార్తలు వచ్చాయి. గత సంవత్సరం జరిగిన రిజర్వేషన్ల ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి వచ్చి ఢిల్లీలో గుర్తు తెలియని ప్రాంతంలో ఉంటున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అరెస్టు

హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో గల సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన కవితను అదుపులోకి తీసుకున్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కవిత సింగరేణి భవన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపెండెంట్ ఉద్యోగులను పునరుద్ధరించాలని ఆమె అన్నారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కవితతో పాటు బైఠాయించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## దసరా నాటికి ఉప్పల్– నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

**: మంత్రి కోమటిరెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి):: ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు 2026 దసరా నాటికి కచ్చితంగా పూర్తిచేస్తామని రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా ఆర్‌అండ్‌బీ, నిర్మాణ సంస్థను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి మంత్రి.. వెంటనే బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉప్పల్ వరంగల్ మార్గంలో అధికారులు ఇప్పటికే బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉప్పల్ వరంగల్ మార్గంలో ప్రయాణించే వారికి, మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. మొత్తం 5.5 కి.మీ గాను 1.5కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మేడారం జాతర ప్రారంభమయ్యే నాటికి బీటీ రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం, రాజకీయాలకు అతీతంగా 2026 దసరా నాటికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభిస్తామని పునరుద్ఘాటించారు.



ప్రభుత్వ పరిపాలనలో అత్యంత కీలకమైన శాఖ సమాచార మరియు పబ్లిక్ రిలేషన్స్ శాఖ.. ఎందుకు ఈ శాఖ కీలకమైనదిగా చెప్పకుంటున్నామంటే.. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు ప్రజా ఉపయోగకర ప్రాజెక్టులు ఎప్పటికప్పుడు ప్రజల ముంగిటికి తీసుకుని వచ్చే శాఖ ఈ శాఖ.. వివిధ రకాల అడ్వర్టైజ్మెంట్ల ద్వారా, వివిధ మీడియా ద్వారా, పత్రికల ద్వారా తాము చేసే పనులను ప్రజలకు తెలిసేలా ఈ శాఖ ద్వారా ప్రభుత్వం వెలుగులోకి తీసుకుని వస్తుంది. ఇది చాలా ముఖ్యమైన విషయం.. ఎందుకంటే ప్రజలు కూడా తమకు జరిగే మేలు, తమ అభ్యున్నతి కోసం ఏర్పాటు చేస్తున్న పథకాలు దానికి సంబంధించిన సమాచారం ఆ పథకాలను ఎలా వినియోగించుకోవాలి అన్న విషయాలను కూలంకుషంగా ఈ ప్రకటనల ద్వారా తెలుసుకొనే వెసులుబాటు కలుగుతుంది.. ఇంతవరకు బాగానే ఉంది.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఈ శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దనే ఉంచుకున్నారు.. అయితే ఈ శాఖ పనితీరుపై విమర్శలు వెల్లు వెతుతున్నాయి.. ఏ ముఖ్యమంత్రి అయినా తాను చేసే పనులు ప్రజల్లోకి వెళ్లాలని కోరుకుంటారు ఇందులో తప్పలేదు.. కానీ చేయని పనులను కూడా అడ్వర్టైజ్మెంట్ రూపంలో ప్రజల ముందుకు తీసుకు రావడం తప్పు.. కానీ దురదృష్టం ఏమిటంటే ఇలాంటి వ్యవహారాలు జరుగుతూ ఉండటం.. ఇదంతా ఒక ఎత్తు అయితే ప్రభుత్వ ప్రకటనలు అనేవి అన్ని మీడియా సంస్థలకు, అన్ని పత్రికలకు అంటే చిన్న పెద్ద తేడా లేకుండా సమానంగా కేటాయించాల్సి ఉంటుంది.. కానీ ఆ విధంగా జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు.. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న మీడియా వార్తాపత్రికలకు మాత్రమే భారీ ఎత్తున ప్రకటనలు జారీ చేస్తూ ఉన్నారు అన్నది యదార్థం.. ఇది ఎంత మాత్రం ఆచరణీయం కాదన్నది మేధావుల వాదన.. ఎందుకంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక మీడియా సంస్థను గాని ఒక పత్రికను కానీ నడపాలంటే చాలా వ్యయ ప్రయాసలతో కూడిన పని.. చిన్నచిన్న మీడియా సంస్థలకు పత్రికలకు ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల ద్వారానే అంతో ఇంతో ఆదాయం లభిస్తుంది.. దానితోనే తమ సంస్థలను నడుపుతూ ఉంటారు.. కానీ ప్రభుత్వ తప్పిదాల వాళ్లను ఉన్నతాధికారుల అవినీతి వల్లనో ప్రకటనలు అన్ని పత్రికలకు అన్ని మీడియా సంస్థలకు సమానంగా అందడం లేదు.. దీనితో చిన్న చిన్న సంస్థలు ఎన్నో కష్టాలకు ఆటుపోట్లకు గురి అవుతూ ఉన్నాయి.. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపుల అవినీతి జరుగుతోంది అన్నది నిర్వివాదాంశం.. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ శాఖను ప్రక్షాళన చేయకపోతే భవిష్యత్తులో చిన్నచిన్న మీడియా సంస్థల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుంది.. అదేవిధంగా ప్రభుత్వం చేసే పలు పథకాలు ప్రజల చెంతకు చేరకుండా ఉండే ప్రమాదం కూడా సంభవిస్తుంది.. లేనివి ఉన్నట్లుగా చూపించే ప్రయత్నం చేస్తే ప్రజలకు ఎంతో నష్టం కలిగే అవకాశం కూడా ఉంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపి తన ఆధీనంలో నడుస్తున్న సమాచార అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖను గాడిలో పెట్టాలని విమర్శకులు, మేధావులు, సామాజికవేత్తలు సూచిస్తూ ఉన్నారు..

# వెంటాడుతున్న వైఫల్యాలు..

- రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోనే కొనసాగుతున్న సమాచార, పబ్లిక్ రిలేషన్స్ శాఖ..
- ప్రజలకు అత్యుత్తమ సమాచారం అందించే ప్రధాన శాఖ ఇది..
- ప్రభుత్వం ప్రజల కోసం ఏమి చేస్తోంది.. ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది అన్న విషయాలు ఈ శాఖ ద్వారా తెలుసుకోవచ్చు..
- భారీ ఎత్తున అడ్వర్టైజ్మెంట్ ల ద్వారా ప్రభుత్వం చేసే పనులను ప్రజల ముంగిట్లోకి తీసుకువచ్చే కీలకమైన శాఖ సమాచార శాఖ..
- వివిధ అడ్వర్టైజ్మెంట్ సంస్థలు మీడియా సంస్థలు వార్తాపత్రికల ద్వారా ప్రచారం సాగిస్తారు
- ప్రకటనలు ఇచ్చే క్రమంలో భారీ ఎత్తున అవినీతి చోటుచేస్తోంది అన్న విమర్శలు వెల్లు వెతుతున్నాయి..
- ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న మీడియా సంస్థలకు మాత్రమే ప్రకటనలు జారీ చేస్తున్నారని విమర్శకులు అంటున్నారు..
- ఈ వ్యవహారంలో భారీ ఎత్తున కమిషన్లు చేతులు మారుతున్నాయని తెలుస్తోంది..
- ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా ఈ శాఖలో అవినీతి జరిగే అవకాశం లేదంటున్న విమర్శకులు..
- ముఖ్యమంత్రి ఆధీనంలో నడుస్తున్న ఈ శాఖలో అవినీతి భారీ ఎత్తున చోటు చేసుకోవడం దురదృష్టకరం..
- మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిసే జరుగుతోందా తెలియకుండా అధికారులు మేనేజ్ చేస్తున్నారా..?
- సమాచార అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ నిర్వహణలో లోపాలపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..

*(స్పెషల్ కరస్పాండెంట్) :*
*హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి ) :*

సమాచార అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ, అంటే ఐ అండ్ పి ఆర్.. శాఖ తెలంగాణలో తన పాత్రని ఏ విధంగా నిర్వహిస్తోంది..? అన్న విషయంపై చర్చ జరుగుతూ ఉంది..

*** ఐ అండ్ పి ఆర్ శాఖ యొక్క విధులు:**

*** మొదటగా ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం:**

ఈ శాఖ ప్రభుత్వ కార్యాచరణలను, పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తుంది.

ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ మీడియా



అంటే పత్రికలు, టీవీ, ప్రసారం వగైరాలతో సంబంధాలు నిర్వహించి ప్రభుత్వ వార్తలను, మెసేజ్‌లను ప్రచారం చేస్తుంది.

*** ఫోటోగ్రఫీ, వీడియో కవర్:**

ముఖ్య అధికారులు అంటే వీఐపీలు, వి.వి.ఐ.పి లు, పాల్గొనే కార్యక్రమాలు, సందర్శనలు లాంటి సందర్భంలో ఫోటో, వీడియో కవరేజ్ నిర్వహించడం చేస్తారు..

**ప్రచురణలు :**

అవసరమైతే ప్రకటనల ప్రచురణలు అంటే బ్రోచర్లు, బ్లూప్రింట్ లు విడుదల చేయడం ద్వారా ప్రజలలో అవగాహన పెంచడం జరుగుతుంది..

**పత్రికల అక్రిడిటేషన్:**

మీడియా వ్యక్తులకు ప్రెస్ అక్రిడిటేషన్ జారీ చేయడం ఈ శాఖ ద్వారానే జరుగుతుంది..

**ప్రజా ఫీడ్‌బాక్:**

జిల్లా స్థాయిలో ప్రజల అభిప్రాయాలను, పాలసీపై స్పందనను సేకరించడానికి ప్రాంతీయ, జిల్లా ప్రజా సంబంధాల అధికారులు నిమగ్నమై ఉంటారు.

**సాంస్కృతిక కమ్యూనికేషన్:**

ప్రదర్శనలు, పాట, నాటకం, స్ట్రీట్ షోలు వంటివి ప్రభుత్వ పథకాల ప్రచారానికి ఈ శాఖ ద్వారానే ఉపయోగించడం జరుగుతుంది..

**సోషల్ మీడియా శిక్షణ:**

పబ్లిక్ రిలేషన్స్ అధికారుల కొరకు సోషల్ మీడియా వాడకంపై శిక్షణ కూడా ఈ శాఖ నిర్వహిస్తూ ఉంది..

సమ్మిళితంగా, ఈ శాఖ "ప్రజా కమ్యూనికేషన్ - ప్రసారం - ప్రజలకు ప్రభుత్వ సమాచారం అందజేయడం" అనే ముఖ్యమైన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ ఉంది..

*** రేవంత్ రెడ్డి పరిపాలనలో అవినీతి ఆరోపణలు :**

ఐ అండ్ పి ఆర్ శాఖకు నేరుగా సంబంధించిన అవినీతి చర్చ జరుగుతూ ఉన్నప్పటికీ.. ప్రధాన పాలనా వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలు ఉన్నాయి, అలాగే ఐ అండ్ పి ఆర్ పవిత్ర కూడా ఈ అవినీతిలో భాగస్వామ్యం అయిందని ఆరోపణలు కూడా వస్తూ ఉన్నాయ..

*** అమృత్ టెండర్ స్కాం ఒకసారి చూద్దాం :**

బి.ఆర్.ఎస్ నాయకుడు కేటీ రామారావు, రేవంత్ రెడ్డి కుటుంబంపై అమృత్ టెండర్‌లలో స్కామ్ ఉన్నట్లు ఆరోపించారు.

**నేషనల్ హెరాల్డ్ కేసు :**

రేవంత్ రెడ్డి పేరు ఈ డి ఛార్జ్‌షీట్‌లో ఉంది. దీనిపై కేటీ రామారావు తీవ్ర విమర్శలు చేశారు, దీనిని "తెలంగాణ ఏటీఎంగా మార్చేశారు" అని అన్నారు.

**టిడి ఆర్ స్కామ్ ఆరోపణ:**

కేటీ రామారావు రేవంత్ రెడ్డి పై "వస్తు అభివృద్ధి హక్కుల అంటే టి డి ఆర్ మార్కెట్‌ను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాడనే తీవ్ర ఆరోపణలు చేశారు..


ఈ శాఖపై వస్తున్న ఆరోపణలను రేవంత్ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోలేక పోతోందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి..

**కాళేశ్వరం ప్రాజెక్ట్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై దృష్టి పెట్టి, ఆ కేసును సీబిఐ కు అప్పగించేందుకు ప్రకటించారు.

**రిసార్ట్ స్కామ్ ఆరోపణ:**

జీవన్ రెడ్డి అనే మాజీ బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి పై భారీ రిసార్ట్ స్కామ్ దాదాపు రూ. 10,000 కోట్లదాకా, ఆరోపణలు చేశారు.






అయితే ఈ ఆరోపణలు నిజమా కాదా అన్న విషయాన్ని వివిధ మీడియా సంస్థలు శాసించే స్థాయిలో ఉండటం గమనార్హం..

*** ఐ అండ్ పీ.ఆర్. శాఖలో అవినీతి ఉండే అవకాశాలు :**

ఐ అండ్ పీ.ఆర్. శాఖసర్వీసు ప్రకారం, ఇది ప్రభుత్వ ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ ప్లాన్లు, బడ్జెట్ వ్యవహారాలను ప్రజలకు తెలియజేయడంలో ఇది కీలక సహాయకంగా పనిచేస్తుంది..

అయితే ఐ అండ్ పీ.ఆర్. శాఖను రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించే అవకాశాలు పెరగవచ్చు. ఉదాహరణకి, మీడియా ప్రాధాన్యత ఇవ్వడంలో పక్షపాత ధోరణి కనిపిస్తోంది..

ఇక ఐ అండ్ పీ ఆర్ I-శాఖ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ కమ్యూనికేషన్, ప్రజలకు సమాచారం అందించడంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది.

అయితే అవినీతి ప్రధానంగా ఐ అండ్ పీ ఆర్ శాఖకే కాకుండా ఇతర ప్రభుత్వ ప్రాజెక్టులు అంటే టెండర్లు, రియల్ ఎస్టేట్ విషయంలో కూడా వెలుగు చూస్తున్నాయి..

**పారదర్శకత అవసరం:**

ఐ అండ్ పీ ఆర్ శాఖను "ప్రచార యంత్రంగా" కాకుండా నిజమైన సమాచార వనరుగా మార్చడం కోసం ప్రజా పరిపాలనలో మరింత పారదర్శకత, మీడియా స్వతంత్రత అవసరం అని సూచిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ"...

## జాగృతి జనం బాటలో భాగస్వామ్యం కండి..

*** పిలుపు నిచ్చిన కప్పాటి పాండురంగారెడ్డి..**

*** రంగారెడ్డి జిల్లాలో కవిత పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి..**

హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న 'జనం బాట' పర్యటనకు రంగారెడ్డి జిల్లాలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ప్రజల్లోకి నేరుగా వెళ్లి వారి సమస్యలను అర్థం చేసుకోవడమే లక్ష్యంగా కవిత ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని కీలక నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.20న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్,



చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో... 21న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్బీ నగర్ నియోజకవర్గాల్లో పర్యటన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తూ ఏర్పాట్లపై పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ సందర్భంగా జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, జనం బాట ప్రజల వాస్తవకమైన జీవన పరిస్థితులను తెలుసుకునే వేదికగా మారిందన్నారు. గ్రామాలు, బస్తీలు తిరుగుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటూ కవిత ముందుకు వచ్చిన తీరు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.జనం బాట కార్యక్రమం ద్వారా ప్రజల్లో జాగృతి, అవగాహన మరింత పెరుగుతోందని, ప్రజల స్పందన ఉత్సాహభరితంగా ఉందని తెలిపారు.ఈ పర్యటనతో జిల్లాలోని సమస్యలు స్పష్టంగా బయటపడతాయని, వాటి పరిష్కారానికి జాగృతి ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు.

## ఎస్ఎన్‌డిపి నాలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

*** జల్ పల్లి: మహేశ్వరం. నవంబర్ 19 /భారత శక్తి ప్రతినిధి.**

మహేశ్వరం నియోజకవర్గంలోని జలపల్లి మున్సిపాలిటీ నబిల్ కాలనీలో జరుగుతున్న ఎస్ఎన్‌డిపి నాలా పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ,ఈ కాలనీలో స్థానిక ప్రజలు మురుగునీరు మరియు వర్షపు నీటి సమస్యల వల్ల చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారు.



అయినప్పటికీ నాలా పనులు నత్తనడకన సాగడం ఆందోళన కలిగిస్తోంది.పనులు ఇంకా ఎందుకు పూర్తికాలేదో అధికారులు తక్షణమే సమగ్రంగా సమీక్షించి, అవసరమైన సిబ్బందిని పెంచి పనులను వేగవంతం చేయాలి అని స్పష్టం చేశారు.అదేవిధంగా, ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకటరామ్, డీఈ, ఏఈ, ఎస్ఎన్‌డిపి విభాగాధికారులు, నాయకులు సు. రెడ్డి కృష్ణారెడ్డి, అబ్దుల్లా తదితరులు అలాగే నబిల్ కాలనీ నివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ.

*** పూజలో పాల్గొన్న చిగురింత పారిజాత నరసింహా రెడ్డి..**

హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి నివాసంలో జరిగిన అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు పాల్గొన్నారు.ఇంకా ఈ పడి పూజ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, గౌర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..



## 450 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా



హైదరాబాద్, నవంబర్ 19 (భారత శక్తి) : రంగారెడ్డి జిల్లా లో సరూర్‌నగర్ మండలం కర్మాంగట్ గ్రామంలోని సాయి గణేశ్ నగర్‌లో పార్కును హైడ్రా కాపాడింది. 1979లో మొత్తం 176 ప్లాట్లతో సాయి గణేష్ నగర్ లేఔట్ వేశారు. దాదాపు 450 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు ఈ పార్కు స్థలంపై అనధికార గది నిర్మాణం చేపట్టారు. వారిని ప్రశ్నించిన కాలనీ వాసులను ఆక్రమణదారులు బెదిరించారు. కాలనీ నివాసితులు హైడ్రా కి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన హైడ్రా అధికారులు వెళ్లి పరిశీలించారు. పార్కు స్థలంపై చిన్న గది, గోడ వంటి అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు గుర్తించారు. సంబంధిత వ్యక్తులు సమర్పించిన పత్రాలను పరిశీలించగా, ఆ నిర్మాణం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు కాని పూర్తిగా అక్రమ నిర్మాణం అని నిర్ధారించారు.హైడ్రా అధికారులు స్వయంగా ఆ అక్రమ గోడను తొలగించి, అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రాకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.




Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.